www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి
TELANGANA RISING
CURE - PURE - RARE
EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:77 FRIDAY , JULY 31,2026 PAGES:8 COST: 4 /-
ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 77 శుక్రవారం 31 జూలై 2026 పేజీలు :8 వెల: 4/-







## ఉద్యోగులు, పెన్షనర్లకు రేవంత్ సర్కార్
# గుడ్‌న్యూస్

హంసకలం వార్త : ఉద్యోగులకు ఇచ్చిన హామీని తెలంగాణ ప్రభుత్వం అమలు చేసింది. గత 100 రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన రూ.6,000 కోట్ల బకాయిల చెల్లింపులను పూర్తి చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. గురువారం మరో రూ.2,000 కోట్లను విడుదల చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఈ నిధులను విడుదల చేసినట్లు ఆర్థిక శాఖ వెల్లడించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ మిగతా2లో

# ‘2034 వరకు నేనే సీఎం’

## ఉపాధ్యాయులకు సీఎం రేవంత్ కీలక హామీ

- టీచర్ల సమస్యలు తన బాధ్యతన్న సీఎం
- విద్యార్థుల కోసం పోరాడాలని పిలుపు
- 55 రోజుల్లో 11 వేల మంది టీచర్లను నియమించామని వ్యాఖ్య
- ఆర్నెల్లకోసారి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం
- ప్రతి నెల ఒకటో తేదీన జీతాల హామీ




హంసకలం వార్త : విద్యాశాఖలో సంస్కరణలు చేపడుతున్న ప్రతిసారీ కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తనపై విమర్శలు చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అయితే వారి సమస్యలను పరిష్కరించే బాధ్యత పూర్తిగా తనదేనని స్పష్టం చేశారు. ఇకపై ఉపాధ్యాయ సంఘాలు తమ వ్యక్తిగత సమస్యల కోసం కాకుండా విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పిలుపుని చ్చారు. ఫిన్‌లాండ్, జర్మనీ పర్యటన ముగించుకుని వచ్చిన ఉపాధ్యాయుల బృందంతో ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో జరిగిన మిగతా2లో

## మోదీ రూ.151 లక్షల కోట్లు
# అప్పు చేశారు

-వివరాలు7లో-

# పాలమూరు, సీతమ్మ సాగర్‌కు లైన్ క్లియర్



**తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టులో ఊరట**
**పాలమూరు, సీతమ్మ సాగర్, గౌరవెల్లి ప్రాజెక్టులకు మేలు**
**పాత పర్యావరణ అనుమతులు చెల్లుబాటవుతాయని స్పష్టత**
**కేంద్ర పర్యావరణ శాఖ మెమోరాండంను కొట్టివేసిన సుప్రీం**

హంసకలం వార్త : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక ప్రాజెక్టుల మిగతా2లో

# తెలంగాణలో వాన జోరు..



**తాలిపేరు, వట్టి వాగు ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల**
**గోదావరి ఉధృతికి పలుచోట్ల నిలిచిపోయిన రాకపోకలు**
**సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల్లోకి వరద.. పూర్తిగా ఆగిన బొగ్గు ఉత్పత్తి**

హంసకలం వార్త : తెలంగాణతో పాటు ఎగువ ప్రాంతాల్లో గత రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కృష్ణా, గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. 2



# రెండు రోజులుగా వర్షాలు..

**అధికారులు అందరూ ఫీల్డ్‌లో ఉండాల్సిందే మంత్రి కోమటిరెడ్డి**

హంసకలం వార్త : తెలంగాణలో రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలు, ఆర్ అండ్ బీ డివిజన్ల వారీగా రోడ్లు, బ్రిడ్జిలు, లో కాజ్‌వేలు, కల్వర్టుల వివరాలపై ఆరా తీశారు. ముంపు మిగతా2లో

# నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

## గణేశ్ విగ్రహ తయారీదారులకు సీపీ హెచ్చరిక



హంసకలం వార్త : గణేశ్ విగ్రహాల గరిష్ట ఎత్తు 16 అడుగులకు పరిమితం చేయాలని తయారీదారులను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆదేశించారు. వినాయక చవితి సమీపిస్తుంది. ఈ నేపథ్యంలో విగ్రహాల తయారీ దశ నుంచే భద్రతా నిబంధ నలు కచ్చితంగా పాటించాలని వారికి స్పష్టం చేశారు. గణేశ్ ఉత్సవాలపై హైదరాబాద్ పోలీసులు ముందస్తు సన్నాహాలు చేస్తున్నారు. అందుకోసం గురువారం నగర సీపీ వీసీ సజ్జనర్ అధ్యక్షతన విగ్రహ తయారీదారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రశాంతంగా, సురక్షితంగా, పర్యావరణహితంగా ఉత్సవాలు నిర్వహించడమే లక్ష్యమని ఈ సందర్భంగా వారికి సీపీ స్పష్టం చేశారు. గతేడాది హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 23 వేల గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించినట్లు వివరించారు. సమీక్షా సమావేశం నిర్వహించారు. మిగతా2లో

## పంచాయతీ నిధుల పక్కదారిపై పూర్తి విచారణ జరపాలి



కేంద్ర, రాష్ట్ర మంత్రులకు బండి సంజయ్ లేఖ


- పంచాయతీలకు కేంద్రం విడుదల చేస్తున్న నిధులను పక్కదారి పట్టిస్తున్నారన్న బండి సంజయ్
- నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేయాలని సర్పంచులపై ఒత్తిళ్లు తెస్తున్నారని ఆరోపణ
- నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలన్న బండి సంజయ్ 2

# పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం..

- రాజ్యసభలో పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం
- పేపర్ లీక్‌లకు పాల్పడితే 10 ఏళ్ల వరకు జైలు, రూ.50 లక్షల జరిమానా
- బిల్లుపై చర్చ సందర్భంగా ప్రభుత్వాన్ని నిలదీసిన ప్రతిపక్ష నేత ఖర్గే



హంసకలం వార్త :దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పరీక్షా పత్రాల లీకేజీ వ్యవహారాల పై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపేం దుకు సిద్ధమైంది. ఇప్పటికే లోక్‌సభ 2లో



## ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకుంటే సంక్షేమ పథకాలు ఆగిపోతాయా?

- ఇందిరమ్మ ఇళ్ల పథకంపై వస్తున్న వదంతులు నమ్మవద్దని విజ్ఞప్తి
- ఈ పథకానికి దరఖాస్తు చేస్తే ఇతర సంక్షేమ పథకాలు ఆగవని స్పష్టత
- తప్పుడు ప్రచారం చేసేవారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక

హంసకలం వార్త :ఇందిరమ్మ ఇళ్ల పథకంపై సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దని తెలంగాణ హౌసింగ్ బోర్డ్ వైస్ ఛైర్మన్ వి.పి. గౌతమ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవడం వల్ల ఇతర సంక్షేమ పథకాలకు ఎలాంటి ఆటంకం కలగదని ఆయన స్పష్టం చేశారు. ఈ మిగతా2లో

# తెలంగాణలో కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్..

**తెలంగాణలో పేరుకుపోతున్న ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ దరఖాస్తులు**
**రెండు రోజుల్లో జారీ చేయాలన్న నిబంధన అమలు కాని వైనం**
**రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో 50,000కు పైగా దరఖాస్తులు**

హంసకలం వార్త : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్ (ఎఫ్ఆర్‌సీ) జారీ ప్రక్రియలో జాప్యం నెలకొంది. దరఖాస్తు చేసుకున్న రెండు పనిదినాల్లోనే ధ్రువీకరణ పత్రం అంద జేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదే శాలు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థా యిలో గడువు పాటించకపోవడంతో మిగతా2లో

# ‘2034 వరకు నేనే సీఎం’





విద్యాశాఖలో సంస్కరణలు చేపడుతున్న ప్రతిసారీ కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తనపై విమర్శలు చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అయితే వారి సమస్యలను పరిష్కరించే బాధ్యత పూర్తిగా తనదేనని స్పష్టం చేశారు. ఇకపై ఉపాధ్యాయ సంఘాలు తమ వ్యక్తిగత సమస్యల కోసం కాకుండా విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఫిన్‌లాండ్, జర్మనీ పర్యటన ముగించుకుని వచ్చిన ఉపాధ్యాయుల బృందంతో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులకు తాను ఒక్కటే చెబుతున్నానని రేవంత్ అన్నారు. “మీ సమస్యలు నాకు వదిలేయండి. మీరు అడగకముందే వాటిని పరిష్కరిస్తాను. ప్రమోషన్లు, బదిలీలు కూడా మీ ఇంటి వద్దకే పంపించాం. ఇకపై మీకోసం కాదు.. విద్యార్థుల సమస్యల కోసం నాతో కొట్లాడండి” అని సూచించారు. విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని కోరారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని వ్యాఖ్యానించిన రేవంత్ రెడ్డి, ఆ లోపు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పూర్తి బాధ్యత వహిస్తానన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కేవలం 55 రోజుల్లో 11 వేల మంది ఉపాధ్యాయులను నియమించామని గుర్తు చేశారు. ఇలాంటి నియామకాలు గతంలో ఎప్పుడైనా జరిగాయా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం ఉపాధ్యాయులదేనని, అందుకే వారి సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. రాబోయే ఐదేళ్లలో తెలంగాణ విద్యాశాఖను ప్రపంచ దేశాలు ఆదర్శంగా చూసే స్థాయికి తీసుకెళ్లాలని రేవంత్ పిలుపునిచ్చారు. పంచవర్ష ప్రణాళిక తరహాలో ఉపాధ్యాయ సంఘాలు ప్రతిజ్ఞ చేసి పని చేయాలని కోరారు. అలాంటి కృషి చేస్తే విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని అన్నారు. దేశానికి విద్య, వైద్య రంగాల్లో తెలంగాణే నాయకత్వం ఎందుకు ఇవ్వకూడదని ప్రశ్నించారు. ఇకపై ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయ సంఘాల నాయకులతో నేరుగా చర్చిస్తానని సీఎం హామీ ఇచ్చారు. వారి సమస్యల పరిష్కారానికి క్రమం తప్పకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో ఒకటో తేదీన ఉద్యోగుల జీతాలు సమయానికి పడేవి కాదని, ఇప్పుడు మాత్రం అడగకుండానే ప్రతి నెల ఒకటో తారీఖున జీతాలు జమ చేస్తున్నామని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా అదే రోజు వేతనాలు చెల్లిస్తున్నామని వెల్లడించారు.

## తెలంగాణలో వాన జోరు..

తెలంగాణతో పాటు ఎగువ ప్రాంతాల్లో గత రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కృష్ణా, గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. జలాశయాలకు వరద నీరు పోటెత్తుతుండటంతో రైతాంగంలో ఆశలు చిగురిస్తుండగా, మరోవైపు పలుచోట్ల వరద ప్రభావం తీవ్రంగా ఉంది. ప్రధానంగా, సింగరేణి గనుల్లోకి నీరు చేరడంతో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర అంతరాయం కలిగింది.
మంచిర్యాల జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ప్రస్తుతం 46 వేల క్యూసెక్కుల ఇన్-ఫ్లో నమోదవుతోంది. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 12.88 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని తాలిపేరు ప్రాజెక్టుకు 96,445 క్యూసెక్కుల వరద వస్తుండటంతో అధికారులు 24 గేట్లు ఎత్తి 96,472 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. అటు కొమురం భీం జిల్లాలోని వట్టి వాగు ప్రాజెక్టుకు 8 వేల క్యూసెక్కుల ఇన్-ఫ్లో వస్తుండగా, 3 గేట్లు ఎత్తి 10,500 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. మరోవైపు, భారీ వర్షాల కారణంగా జనజీవనం అస్తవ్యస్తమైంది. జగిత్యాల జిల్లాలో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ధర్మపురి వద్ద పుష్కర ఘాట్లను వరద తాకింది. అనంతారం బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. భారీ వర్షాల ధాటికి మంచిర్యాల జిల్లాలోని ఇందారం, శ్రీరాంపూర్, కల్యాణి ఖని వంటి సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల్లోకి భారీగా వరద నీరు చేరింది. దీనివల్ల రోజుకు సుమారు 30 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తితో పాటు 2 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీత పనులు నిలిచిపోయాయని అధికారులు వెల్లడించారు. వర్షాలు తగ్గుముఖం పట్టాకే గనుల్లో పరిస్థితి సాధారణ స్థితికి వస్తుందని వారు పేర్కొన్నారు.

## పంచాయతీ నిధుల పక్కదారిపై పూర్తి విచారణ జరపాలి

తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర ఆర్థిక సంఘం విడుదల చేస్తున్న నిధుల వినియోగంలో తీవ్ర అక్రమాలు జరుగుతున్నాయని, మార్గదర్శకాలకు విరుద్ధంగా నిధులను పక్కదారి పట్టిస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. కేంద్ర నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేయాలంటూ పంచాయతీ అధికారులపై, సర్పంచులపై ఒత్తిళ్లు తెస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిధుల దుర్వినియోగంపై పూర్తిస్థాయి నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరుతూ కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్కలకు బండి సంజయ్ లేఖలు రాశారు. సర్పంచులు తమకు ఎదురవుతున్న ఒత్తిళ్లపై ఆధారాలతో సహా ఇచ్చిన ఫిర్యాదులను లేఖలకు జత చేసినట్లు ఆయన తెలిపారు. “గ్రామీణ వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి పంచాయతీరాజ్ వ్యవస్థే మూలస్తంభం. ఇక్కడ నిధులు పక్కదారి పడితే గ్రామాల అభివృద్ధి స్తంభించిపోవడమే కాకుండా, పంచాయతీల ఆర్థిక స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుంది” అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు తక్షణమే జోక్యం చేసుకుని, ఆధారాల ఆధారంగా పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## రెండు రోజులుగా వర్షాలు..
## అధికారులు అందరూ ఫీల్డ్‌లో ఉండాల్సిందే:

తెలంగాణలో రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలు, ఆర్ అండ్ బీ డివిజన్ల వారీగా రోడ్లు, బ్రిడ్జిలు, లో కాజ్‌వేలు, కల్వర్టుల వివరాలపై ఆరా తీశారు. ముంపు ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కల్వర్టులు, లో కాజ్‌వేలు, కోతకు గురైన రోడ్ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టాలన్నారు. అధికారులు అందరూ ఫీల్డ్‌లో ఉండాలని ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న రోడ్లు, బ్రిడ్జిల వద్ద తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఫీల్డ్ రిపోర్ట్ తయారు చేయాలని, క్షేత్రస్థాయి ఇంజినీర్లతో మొబైల్ ఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని వెల్లడించారు. ఈఎన్సీ నుంచి ఏఈ వరకూ అందరు పూర్తి అలెర్ట్‌గా ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

## తెలంగాణలో కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్..

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్ (ఎఫ్‌ఆర్‌సీ) జారీ ప్రక్రియలో జాప్యం నెలకొంది. దరఖాస్తు చేసుకున్న రెండు పనిదినాల్లోనే ధ్రువీకరణ పత్రం అందజేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో గడువు పాటించకపోవడంతో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో పడ్డాయి. ఈ పథకం ప్రారంభమైన జూలై 27 నుంచి బుధవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాల ద్వారా 50 వేలకు పైగా దరఖాస్తులు అందాయి. తొలిరోజే దరఖాస్తు చేసుకున్న వారికి సైతం ఇప్పటివరకు సర్టిఫికెట్లు అందకపోవడంతో, వారు నిత్యం మీసేవ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఫలితంగా దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత నెల 25న విడుదల చేసిన జీవో 172 నిబంధనల ప్రకారం, దరఖాస్తు అందిన రెండు పనిదినాల్లోగా సంబంధిత తహశీల్దార్లు వాటిని పరిశీలించి సర్టిఫికెట్లను జారీ చేయాలి. అయితే, పలు ప్రాంతాల్లో ఈ నిబంధన అమలు కావడం లేదు.

**సర్టిఫికెట్ జారీ ప్రక్రియ ఇదే**

పౌరసరఫరాల శాఖ వద్ద ఉన్న రేషన్ కార్డుల సమాచారం ఆధారంగా ప్రభుత్వం ‘తెలంగాణ ఫ్యామిలీ రిజిస్టర్’ను సిద్ధం చేసింది. పౌరులు మీసేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోగానే, ఆ దరఖాస్తు నేరుగా సంబంధిత తహశీల్దార్ లాగిన్‌లోకి వెళ్తుంది. అక్కడ తహశీల్దార్ ఆ వివరాలను రేషన్ కార్డు డేటాతో సరిపోల్చి చూసి, అంతా సక్రమంగా ఉంటే డిజిటల్ సంతకంతో ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేయాలి. కానీ, తహశీల్దార్ల స్థాయిలో ఈ ప్రక్రియ మందకొడిగా సాగుతుండటంతో దరఖాస్తుల సంఖ్య భారీగా పేరుకుపోతోంది.

# పాలమూరు, సీతమ్మ సాగర్‌కు లైన్ క్లియర్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులపై నెలకొన్న సందిగ్ధతను తొలగిస్తూ సర్వోన్నత న్యాయస్థానం తాజాగా కీలక తీర్పును వెలువరించింది. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండం (ఓఎం)ను సుప్రీంకోర్టు బుధవారం కొట్టివేసింది. అయితే, ఈ తీర్పు భవిష్యత్తు వ్యవహారాలకు మాత్రమే వర్తిస్తుందని జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. సదరు మెమోరాండం ప్రాతిపదికన గతంలో మంజూరైన పర్యావరణ అనుమతులన్నీ యథాతథంగా చెల్లుబాటులో ఉంటాయని న్యాయస్థానం తేల్చిచెప్పింది. సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన తాజా తీర్పుతో తెలంగాణలోని సాగునీటి ప్రాజెక్టులకు గతంలో లభించిన అనుమతులకు ఎటువంటి ఆటంకం లేదని స్పష్టమైంది. ముఖ్యంగా పాలమూరు-రంగారెడ్డి సహా ఇతర ప్రాజెక్టుల నిర్మాణానికి పర్యావరణ అనుమతుల రూపంలో ఎదురవుతున్న ప్రధాన అడ్డంకి దీంతో తొలగిపోయింది. ఈ పరిణామంతో సదరు ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి మార్గం సుగమమైంది.

## ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకుంటే సంక్షేమ పథకాలు ఆగిపోతాయా?

ఇందిరమ్మ ఇళ్ల పథకంపై సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దని తెలంగాణ హౌసింగ్ బోర్డ్ వైస్ ఛైర్మన్ వి.పి. గౌతమ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవడం వల్ల ఇతర సంక్షేమ పథకాలకు ఎలాంటి ఆటంకం కలగదని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. సొంత స్థలం లేని నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గౌతమ్ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంపై కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అటువంటి ప్రచారాలను పట్టించుకోవద్దని సూచించారు. వదంతులు వ్యాప్తి చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అర్హులైన పట్టణ పేదల కోసం ప్రభుత్వం ఇటీవలే ‘ఇందిరమ్మ ఇళ్లు (క్యూర్)’ పథకాన్ని ప్రారంభించింది. మొదటి దశలో జీహెచ్‌ఎంసీ, సైబరాబాద్, మల్కాజ్‌గిరి పరిధులలో 7,680 బహుళ అంతస్తుల ఫ్లాట్‌లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకంలో లబ్ధిదారులు సుమారు రూ.6 లక్షలు చెల్లించాల్సి ఉండగా, ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీతో పాటు స్థలాన్ని ఉచితంగా అందిస్తుంది. పదేళ్లుగా స్థానికంగా నివాసం ఉండటం, వార్షిక ఆదాయం రూ.6 లక్షలకు మించకపోవడం, ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో ఇల్లు లేదా ఫ్లాట్ లేకపోవడం వంటివి ఈ పథకానికి ప్రధాన అర్హతలుగా నిర్ణయించారు.

## పేపర్ లీక్‌లపై ఉక్కుపాదం

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పరీక్షా పత్రాల లీకేజీ వ్యవహారాలపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమైంది. ఇప్పటికే లోక్‌సభ ఆమోదం పొందిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (అక్రమ పద్ధతుల నివారణ) సవరణ బిల్లు, 2026ను కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకునే వారిని ఏమాత్రం సహించబోమని, పేపర్ లీకేజీల పట్ల తమ ప్రభుత్వం ‘జీరో టాలరెన్స్’ విధానాన్ని అవలంబిస్తోందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీని ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని ఆయన పేర్కొన్నారు. దేశంలోని విద్యార్థులు, యువత ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఈ బిల్లూ ఒక నిదర్శనమని ఆయన తెలిపారు. ఈ చట్టాన్ని తీసుకురావడంలో ప్రధానమంత్రి ఏమాత్రం జాప్యం చేయలేదని కేంద్రమంత్రి వెల్లడించారు. ఈ సవరణ బిల్లు నిబంధనల ప్రకారం, పరీక్షల్లో అక్రమాలకు పాల్పడిన వ్యక్తులకు కనీసం ఐదేళ్ల నుంచి గరిష్ఠంగా పదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ. 50 లక్షల వరకు జరిమానా విధించనున్నారు. ఒకవేళ వ్యవస్థీకృత నేరాలకు పాల్పడితే, కనీస శిక్షను ఏడేళ్లకు పెంచడంతో పాటు జరిమానాను రూ. 10 కోట్ల వరకు విధించేలా ప్రతిపాదించారు. దర్యాప్తును రెండు నెలల్లో పూర్తి చేసి, ఛార్జిషీట్ దాఖలు చేసిన మూడు నెలల లోపు ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ ముగించాలని ఈ బిల్లు నిర్దేశిస్తోంది. బిల్లుపై జరిగిన చర్చలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. నీట్ పేపర్ లీక్ అనంతరం ఎందరో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ప్రభుత్వం ముందస్తు నివారణ చర్యలు ఎందుకు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి, తద్వారా ప్రధానమంత్రి మోదీ కుర్చీని కాపాడారని ఖర్గే వ్యాఖ్యానించారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు:
## గణేశ్ విగ్రహ తయారీదారులకు సీపీ హెచ్చరిక

విగ్రహాల రవాణా సమయంలో గతేడాది నాలుగు ప్రమాదాలు జరిగాయని నగర సీపీ గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో జాగ్రత్తలు తప్పని సరి అని వారికి సూచించారు. మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని తయారీదారులను కోరారు. చిన్న విగ్రహాల ప్రతిష్టాపనపై భక్తులకు అవగాహన కల్పించాలని వివరించారు. విగ్ర హాల తయారీ కేంద్రాల్లో ఫైర్ సేఫ్టీ, సురక్షితమైన విద్యుత్ వైరింగ్ నిబంధనను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. ధూల్‌పేట్, జల్‌పల్లి, మైలాం దేవ్‌పల్లి నుంచి విగ్రహాల రవాణాకు ప్రత్యేక ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలు ఏర్పా టు చేయాలన్నారు. రద్దీ సమయాల్లో భారీ విగ్రహాల రవాణాను నివారించాలని ఆదేశించారు. రవాణాకు ముందు స్థానిక ట్రాఫిక్ పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. విగ్రహాల బుకింగ్, రవాణా సమయం, మార్గాల వివరాలు ముందుగానే పోలీసులకు ఇవ్వాలని తయారీదారులను ఆదేశించారు. భారీ విగ్రహాల రవాణాలో విద్యుత్ తీగలు, ఫ్లైఓవర్లు, మెట్రో మార్గాలకు ఆటంకం కలగకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. లోడింగ్, అన్ లోడింగ్‌కు ఉపయోగించే క్రేన్లు, వాహనాలు సర్టిఫైడ్ అయి ఉండాలని వారికి స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని వినాయ కుని విగ్రహాల తయారీదారులను నగర సీపీ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ఇవ్వాలని తయారీ దారులను ఆదేశించారు. భారీ విగ్రహాల రవాణాలో విద్యుత్ తీగలు, ఫ్లైఓ వర్లు, మెట్రో మార్గాలకు ఆటంకం కలగకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదే శించారు. లోడింగ్, అన్‌లోడింగ్‌కు ఉపయోగించే క్రేన్లు, వాహనాలు సర్టిఫైడ్ అయి ఉండాలని వారికి స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని వినాయకుని విగ్రహాల తయారీదారులను నగర సీపీ వీసీ సజ్జనార్ హెచ్చరించారు.

## ఉద్యోగులు, పెన్షనర్లకు రేవంత్ సర్కార్ గుడ్‌న్యూస్

ఉద్యోగులకు ఇచ్చిన హామీని తెలంగాణ ప్రభుత్వం అమలు చేసింది. గత 100 రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన రూ.6,000 కోట్ల బకాయిల చెల్లింపులను పూర్తి చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. గురువారం మరో రూ.2,000 కోట్లను విడుదల చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఈ నిధులను విడుదల చేసినట్లు ఆర్థిక శాఖ వెల్లడించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం మూడు విడతల్లో ఒక్కోసారి రూ.2,000 కోట్ల చొప్పున మొత్తం రూ.6,000 కోట్లను విడుదల చేసింది. దీంతో పెండింగ్‌లో ఉన్న విశ్రాంత ఉద్యోగుల కమ్యూటేషన్ బకాయిలను పూర్తిగా చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ఇంకా మిగిలి ఉన్న ఇతర బకాయిలను కూడా దశలవారీగా విడుదల చేస్తామని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంది. ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగులు, పెన్షనర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సంపాదకీయం

## పిడకల వేటకూ దొరకని జెన్--జీ

జంతర్ మంతర్ వద్ద ఇటీవల కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనను ఎలా చూడాలి.. అనే దానిమీద ఇంకా చర్చలు సాగుతూనే ఉన్నట్టున్నాయి. మార్పు మనం కోరుకున్న రీతిలో, మోతాదులో, కోరుకున్న పద్ధతిలో ఉంటే తప్ప చాలా మందికి తృప్తి కలగదు. అంగీకరించకపోయినా ఆ ధోరణిని దాని మూలాలను అర్థం చేసుకోవచ్చు. ఎంత గొప్ప రిలీఫ్ అనే ఫీలింగ్ వల్ల ఇప్పుడు ఏర్పడ్డ పాజిటివ్ వైబ్ పలుచనబడే సన్నివేశాలు మరిన్ని వస్తాయి. డాన్స్ వీడియోలతో కాస్త అటూ ఇటూగా అయిపోవచ్చు. రేపో మాపో మందు బాటిళ్ల విజువల్స్ కూడా ముందుకు రావచ్చు. ఆపైన ఎవరో ఇంకెవరితోనో, ఇంకేదో రకంగా ఉన్న విజువల్స్ వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు. దెబ్బతిన్న బలవంతుడు ఊరికే ఉండడు. పైగా చేతినిండా బలగం ఉన్నప్పుడు. ఆ శిబిరం సంగతి వదిలేయండి. ‘ఆ డాన్సులు గట్రా ఏంటండీ, చేయకపోతే బాగుండేది’ అనే దగ్గర సన్నాయి నొక్కులతో బయలుదేరతారే.. వారి గురించి మాట్లాడుకోవాల్సి ఉంది. ఎందుకంటే డాన్స్ దగ్గరే వీడియోలు ఆగవు కాబట్టి. ఇప్పుడు జైకొట్టినోళ్లే అప్పుడు కాస్త స్వరం మార్చి-- ‘అప్పుడే అనుకున్నాం.. ఐడియాలజీ, నిర్మాణం లేకపోతే ఇలాగే...’ అంటూ ఆ రూట్లో ముక్కులు చీదే అవకాశం ఉంటుంది కాబట్టి. ఐడియాలజీ, నిర్మాణం అసలు అవసరం లేదు అనట్లేదు కానీ, నిర్దిష్ట పరిస్థితుల్లో నిర్దిష్టమైన విశ్లేషణ అవసరం. మన బీకరులోనే అన్నీ ఇమడవు. మోదీ మీద కోపం వల్ల ఎవరో ఒకరు ఏదో రకంగా మెడలు వంచారనే సంబరం వల్ల ఆమోదం తప్పితే, ఇతరత్రా మనం కోరుకున్న శాస్త్రీయ పద్ధతుల్లో వారెవరూ లేరు అనే చింత, చింతన చాలా మందిలో ఉంటాయి. మనవల్ల కానిది పిల్లకాయలు చేశారు అనే ఉత్సాహాన్ని శాస్త్రీయ శర్మీయ ఆలోచనా పద్ధతుల త్రాసు అటూ ఇటూ చేస్తా ఉంటది. అక్కడ కాస్త మాట్లాడుకోవాల్సి ఉంది. ఇది పూర్తిగా మరో తరం. దాని కోపం, ప్రేమ, ద్వేషం, ఆనందం వేరే రూపాల్లో వ్యక్తం అవుతుంది. తొలి మూడు సెకన్లలో నువ్వు కండ్లలో కండ్లు పెట్టి నిలపలేకపోతే తప్పుకునిపోతుంది, తప్పించుకునిపోతుంది. ఈ బోరింగ్ బ్యాచ్‌తో నాకెందుకు అని. దిసీజ్ ఇన్‌స్టా జనరేషన్. కండెన్స్‌డ్, షార్ప్, ఆంబిషస్ అండ్ ఇండిపెండెంట్! ధిక్కారం అన్నివేళలా మనం కోరుకున్న పద్ధతుల్లోనే ఉండదు. అసలు మనం కోరుకున్న పద్ధతి అనేది ఎంత అప్డేటెడ్ అనేది వేరే చర్చ. అంతిమంగా ప్రజలకు కనెక్ట్ కావడం కదా దేనికైనా దారి. ఆ దారి మనకు తెలీకపోయిందని చరిత్ర చెబుతున్నది కదా, కాస్త తలవొగ్గి వినడం కూడా నేర్చుకోవాలె. ఈ నేల, దాని మీద కదలికలు మనకు కొన్నిసార్లు నేర్పుతాయి, నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండాలె! ఇంతకీ వాళ్లేం సాధించారు? భయం అనే పొరను ఛేదించారు. నిరంకుశ పాలకుడితో తలపడుతున్నప్పుడు అదే కదా అతి పెద్ద అడ్డంకి, చైనా వాల్. అదిగో వీళ్లు తమ హ్యూమర్‌తో అట్లా ఈకలాగా తీసిపారేశారు. అది కదా విజయమంటే! ఒక దళితుడి నేతృత్వంలో వేలాది మధ్యతరగతి పిల్లలు కులమతాలకు అతీతంగా ఒక్కటై నినదించారు. ఆడారు, పాడారు. అంతకంటే గొప్ప దృశ్యం ఏం కావాలి. అంబేద్కర్‌కు కూడా సాధ్యపడని అపూర్వ దృశ్యం. ఆయన దళిత నాయకుడిగానే, ఇంకా చెప్పాలంటే మహర్ల నాయకుడిగానే తనువు చాలించాల్సి వచ్చింది. దీనర్థం.. అంబేద్కర్ కంటే ఈ కుర్రాడు అభిజిత్ దీప్కే గొప్ప నాయకుడనికాదు. అట్లా దురార్థం తీయకూడదు. ఈ సన్నివేశంలో అతను లేవనెత్తిన డిమాండ్, లేవనెత్తిన తీరు, సందర్భం అన్నీ కలిసి వచ్చాయి. ఎలా వచ్చినా ఒక దళితుడి నాయకత్వాన అంతమంది సవర్ణ విద్యార్థులు పోగవడం ఎప్పుడు చూస్తారండీ! అంతకంటే ఏం చూడాలి మనం! ఆ రెంటినీ మించింది తిరిగొచ్చిన విశ్వాసం. ఈ మట్టిలో ఇంకా బలముందని పంటలు పండలేనంతగా నాశనం కాలేదని, శ్రుతి--లయ సరిగ్గా కలవాలే కానీ ఇక్కడింకా రాగాలు పలకగలవని చూపించారు కదా! అదెంత గొప్ప ఊరట, అందరికీ! ఎండిపోయిందని దిగాలు పడిన చెట్టుకు మళ్లీ పూతపూయడం కాదూ! స్టడీ చేయాల, తెలుసుకోవాల. తెలియజెప్పడం అనేది మాత్రమే అలవాటైన వారు విద్యార్థులుగా మారితే తప్ప కొన్ని అర్థం కావు. దిసీజ్ నాన్ ఐడియలాజికల్, నాన్ స్ట్రక్చరల్, నాన్ ‘సీరియస్’, నాన్ డిస్క్రిప్టివ్ మూవ్‌మెంట్ అండ్ మోమెంట్. అసలది స్టార్ట్ అవ్వడమే సెటైరికల్‌గా స్టార్ట్ అయ్యి, అంతే సెటైర్‌తో బలాన్ని ఎదుర్కొని నిలిచి గెలిచిన మూమెంట్. ఇందులో ఏ పిడకల వేటకూ ఆస్కారం దొరకదు. ఎట్లా పోట్లాడారో అట్లాగే సెలబ్రేట్ కూడా చేసుకుంటారు. అంతిమంగా అందరమూ ఆ డబ్బాలో సెనిక్కాయలు తెచ్చుకుని తింటున్న కుర్రాడి దగ్గరికి, పనిలో దుర్మార్గమైన యాతన ఎదుర్కొంటూ రోదిస్తూ, మనల్ని ఏడిపిస్తూ మాట్లాడుతున్న కార్మికుడి దగ్గరకు రావాల్సి ఉంటుంది. అది ఇంత త్వరగా స్టార్ట్ అయ్యేది కాదు, ముగిసేది కాదు. అది అంతిమ సత్యమే కానీ, ఈ జంతర్ మంతర్ చాటిన సత్యం చిన్నదేమీకాదు. అది చాలా వాటికి ఊపిరినిచ్చింది. దాన్ని చిన్నబుచ్చుక్కర్లేదు. అంతిమంగా ఉపాధ్యాయుల పాత్రలోంచి విద్యార్థుల పాత్రలోకి మారాల్సిన సన్నివేశం ఇది. కనెక్షన్ అనే సింగిల్ పాయింట్ స్టడీ ఇప్పటి అవసరం.

# ప్రతిఘటనతోనే ప్రజాస్వామ్యం పునరుద్ధరణ









రాజ్యాంగబద్ధ ప్రజాస్వామిక సమాజంలో వీధి నిరసన న్యాయసమ్మతమేనా? ఎన్నికలలో పోటీచేయడానికే ప్రాధాన్యమివ్వడం కాకుండా శాంతియుత, ప్రజాస్వామిక ప్రతిఘటనే ప్రతిపక్షాల పురోగతికి సరైన మార్గమని నేను ఇదే కాలమ్‌లో చేసిన వాదనకు ప్రతిస్పందనగా పలువురు నాకు ఆ ప్రశ్న వేశారు. భారతీయ జనతా పార్టీ ఐటీ సెల్ చీఫ్, దర్బారీ మీడియా యాంకర్--ఇన్--చీఫ్, అధికార పార్టీని సమర్థించే విద్యావేత్తలు నా వాదనపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఆ వాదన ప్రజాస్వామ్య వ్యతిరేకమని, రాజ్యాంగ విరుద్ధమని, జాతి--వ్యతిరేకమని తప్పుపట్టారు. అసాధారణంగా జరిగిన యువజనుల నిరసన పాలక పార్టీ వర్గాలకు కలిగించిన నిరుత్సాహం నుంచే ఆ విమర్శలు వచ్చాయనేది స్పష్టం. ప్రజల్లో ప్రగాఢంగా ఉన్న భయసంకోచాలకు తెరదించిన అపూర్వ ప్రజా నిరసన అది. నా వాదనపై వచ్చిన విమర్శల్లో నిజాయితీ లోపించింది. విమర్శకులు చాలా తెలివిగా, తమకు అనుకూలంగా నా వాదనలోని ‘శాంతియుత, ప్రజాస్వామిక’ అనే పదబంధాన్ని విస్మరించారు. ప్రజల్లో విభేదాలు సృష్టించి, మత సామరస్యాన్ని దెబ్బతీసిన రథయాత్రతో అధికారానికి వచ్చినవారు, న్యాయ, రాజ్యాంగ నియమాలను ఉల్లంఘించినవారు వ్యవస్థలను గౌరవించడం గురించి ఉపన్యాసాలు ఇవ్వడం ప్రారంభించారు. రిజర్వేషన్లను వ్యతిరేకించినవారు, సామాజిక న్యాయ భావననే అంగీకరించనివారు స్వతంత్ర భారతదేశంలో పౌర శాసనోల్లంఘనకు వ్యతిరేకంగా అంబేడ్కర్ చేసిన వాదనలను ఉటంకి స్తున్నారు. వాళ్ల విమర్శలు ఇలా ఉన్నాయి: ఒక ప్రజాస్వామిక వ్యవస్థలో ఒక సమస్యను, ఎన్నికైన ప్రజాప్రతినిధులను విస్మరించి, రాజ్యాంగ సంస్థలను ఉపేక్షించి, వీధి నిరసన ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లేందుకు ప్రజలను సమీకరించడం సమర్థనీయమేనా? సమస్యలు, వివాదాలను పరిష్కరించుకునేందుకు రాజ్యాంగ సంస్థలను గౌరవిం చవలసిన అవసరం లేదా? వీధి నిరసనలు అంటే మూకస్వామ్యాన్ని స్వాగతించడం కాదా? మూకస్వామ్యం ప్రబలమయితే నిర్ణయాలు సహేతుకంగా తీసుకోవడం ఎలా సాధ్యమవుతుంది? మూకస్వామ్యం అరాచకానికి దారితీసి రాజ్యాంగబద్ధ పాలనను అసాధ్యం చేయదా? ఇది సమాజంలోని అణగారిన వర్గాల శ్రేయస్సుకు ఎలా దోహదం చేస్తుంది? ఈ ప్రశ్నలు నిరపాయకరమైనవిగా కనిపిస్తు న్నాయి. అయితే వాటిలో లోపాలు ఉన్నాయి. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యంలో సంస్థలు సక్రమంగా పనిచేస్తాయనే సునిశ్చిత విశ్వాసంతోనే ఆ ప్రశ్నలు వేయడం జరిగింది. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యంలో సంస్థలు, వ్యవస్థలు సక్రమంగా ఉంటాయనేది ఒక మిథ్య. సమీకృతమైన ప్రజలు ఉన్మాద హంతక మూకలు కారు. ఒక ఉమ్మడి లక్ష్యంతో అనియతంగా సమావేశమైన జన బాహుళ్యమది. అలిఖిత నైతిక నియమావళి వారి ప్రవర్తనను నిర్దేశిస్తుంది. దీనిని మరింత వివరంగా చూద్దాం. ఆధునిక ప్రజాస్వామ్యాలు ప్రారంభంకాక ముందు లేదా వాటి తొలిదశలో ప్రజా సమూహాలు అందరికీ ఆమోద యోగ్యమైన, అప్పటికే సంప్రదాయపరంగా ఉన్న హక్కులను, పద్ధతులను అనుసరించేవని చరిత్రకారులు వివరించారు. 18వ శతాబ్దిలో ఇంగ్లాండ్‌లోని పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా అప్పటి ప్రజలు లాభాపేక్షలేని ‘నైతిక ఆర్థిక వ్యవస్థ’ను (మోరల్ ఎకానమీ) కోరుకున్నారని ఈపీ థాంప్సన్ వివరించారు. సమష్టి శ్రేయస్సుకు భంగం కలగని రీతిలో ప్రజలు తమ ఆర్థిక, సామాజిక జీవితంలో వ్యవహరించేవారని ఆయన పేర్కొన్నారు. కాబట్టి, పాలనలో ప్రజల భాగస్వామ్యం అన్న భావనను ఉదారవాద ప్రజాస్వామ్యం కొత్తగా ఆవిష్కరించలేదు. సుదీర్ఘకాలంగా ఆచరణలో ఉన్న అసెంబ్లీలు, పిటిషన్లు, ప్రజాసమూహాల ఉమ్మడి నిరసన మొదలైన పద్ధతులను ఆధునిక ప్రజాస్వామ్యాలే వ్యవస్థీకృతం చేశాయి. అందువల్ల, ప్రజాప్రతిఘటన లేదా ‘కలహాశీల రాజకీయాల’ను ఆధునిక ప్రజాస్వామ్యాలు రూపుమాపలేవు. ప్రజాస్వామ్యం పనిచేసే తీరుతెన్నులలో అవి అంతర్భాగాలు. జవాబుదారీతనంతో కూడిన క్రమబద్ధమైన ప్రజాస్వామిక ఆచరణతో పాటు క్రమపద్ధతిలో లేని సామాన్య ప్రజల ఉమ్మడి కార్యాచరణ కూడా పనిచేసే ప్రజాస్వామ్య సజీవ లక్షణం. నిరసన ప్రదర్శనలు, సమ్మెలు, ధర్నాలు, బాయ్‌కాట్‌లు, శాసనోల్లంఘన మొదలైన అనియత పద్ధతుల రూపేణా తమ డిమాండ్లను ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లేందుకు సామాన్య పౌరులు ప్రయత్నిస్తుంటారు. ప్రజా ఉద్యమాలు ప్రజాస్వామిక వైఫల్యానికి చిహ్నాలు కావని పశ్చిమ యూరోప్‌లో గత అయిదు శతాబ్దాల కాలంలో సామాన్య ప్రజల ఉమ్మడి కార్యాచరణను నిశితంగా అధ్యయనం చేసిన చార్లెస్ టిల్లీ అనే చరిత్రకారుడు అభిప్రాయపడ్డారు. ప్రజాఉద్యమాలు వాస్తవానికి ప్రజాస్వామిక పాలన పరిణామ క్రమంలో ఉద్భవించినవేనని ఆయన అన్నారు. అవి వ్యవస్థ పట్ల శత్రుపూర్వకమైనవి కావు. ప్రజా నిరసనలు తరచూ వ్యవస్థాగత సంస్కరణలకు దారితీస్తాయి. వ్యవస్థల సానుకూల ప్రతిస్పందన ప్రజలు మరింతగా సంఘటితమయ్యేందుకు ఉద్దీపన అవుతుందని చార్లెస్ టిల్లీ నిర్ధారించారు. గ్లోబల్ సౌత్ (ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా) ప్రజాస్వామిక వ్యవస్థల్లో ప్రజాసమీకరణల ప్రత్యేక పాత్రను గుర్తించడం చాలా ముఖ్యం. 20వ శతాబ్దంలో వలసపాలన నుంచి విముక్తమైన చాలా దేశాలు ఉదారవాద ప్రజాస్వామ్యాన్ని అనుసరించాయి. అయితే చాలా దేశాలలో ఆ పాలనా పద్ధతులు ప్రభావశీలంగా అమలయేందుకు అవసరమైన సంస్థాగత ప్రాతిపదికలు బలహీనమైనవి. భారత్ లాంటి ప్రజాస్వామిక సమాజంలో ప్రజా ఉద్యమాలు, నిరసనలు సంస్థాగత లోపాలు, లొసుగులను అధిగమించేందుకు దోహదం చేస్తున్నాయి. భారత్‌లో పెద్ద ఎత్తున ప్రజ్వరిల్లే ప్రజా నిరసనలు సంస్థాగత వైఫల్యాలకు అత్యవసర ప్రతిస్పందనలు కావని, భారత ప్రజాస్వామ్య తార్కికతలో అవి అంతర్భాగాలని దీపేశ్ చక్రవర్తి అన్నారు. సమస్యల పరిష్కారానికి రాజ్య వ్యవస్థపై ఒత్తిడి తెచ్చేందుకు మూకుమ్మడి నిరసనలు అనేవి ప్రభావశీలంగా పనిచేస్తున్నాయి, సందేహం లేదు. అసమానతల సమాజంలో ప్రజా నిరసనలు ప్రజాస్వామ్య పరిపుష్టికి తోడ్పడతాయని, అవి ప్రజాస్వామ్యానికి ప్రతికూలతలు కావని భారత్, బ్రెజిల్, దక్షిణాఫ్రికాలలో ప్రజా ఉద్యమాలను తులనాత్మకంగా అధ్యయనం చేసిన పాట్రిక్ హెల్లర్ అభిప్రాయపడ్డారు. న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పోటెత్తిన యువజనుల నిరసన అసాధారణ నేపథ్యాన్ని మనం అంగీకరించాలి. వర్తమాన భారతదేశం సాధారణంగా పనిచేస్తున్న ప్రజాస్వామ్యం కాదు. ప్రజాస్వామిక జవాబుదారీతనం, ప్రతిస్పందనాత్మక స్వభావం కనిపించని కాలమిది. అవధులు లేని సంపూర్ణ అధికారాలకు పాలకులు ఆరాటపడుతున్నారు. తమ విధానాలపై ప్రజల అభిప్రాయాలను అలక్ష్యం చేస్తున్నారు. ప్రధాన స్రవంతి మీడియా ప్రభుత్వానికి పూర్తి విధేయత చూపుతోంది. పాలనపై విమర్శలకు ప్రాధాన్యమివ్వడం లేదు. అలాగే రాజ్యాంగబద్ధ సంస్థలూ అధికారపక్షం రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యమి స్తున్నాయి. అవి అంతకంతకూ స్వతంత్ర ప్రతిపత్తిని కోల్పోతున్నాయి. భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణకు స్వేచ్ఛ కొరవడుతోంది. ప్రతిపక్షాలను రూపు మాపేందుకు రాజ్యాధికారాలు దుర్వినియోగమవుతున్నాయి. ఎన్నికలు జరుగుతున్నాయి కానీ, అవి ఇంకెంత మాత్రం ప్రజల సంకల్పానికి తార్కాణాలుగా లేవు. ఎన్నికల బరిలోకి దిగిన అన్ని పక్షాలకు సమానావకాశాలు లభించడం లేదు. న్యాయవ్యవస్థ రాజ్యాంగ నిబంధనలను అమలు పరచలేకపోతోంది. అధికారపక్షం ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరిస్తూ రాజ్యాంగ ప్రమాణాలను పాటించడం లేదు. ఇటువంటి పరిస్థితులలో వీధులలో ప్రజలను సమీకరించి, నిరసన తెలపడమే ప్రజా ఆకాంక్షలను వ్యక్తం చేసేందుకు లభ్యమవుతున్న ఏకైక మార్గం. వీధి నిరసనలు న్యాయబద్ధమైనవి, ప్రజాస్వామ్యయుతమైనవి, సమర్థనీయమైనవి. జంతర్ మంతర్ వద్ద యువజనుల ధర్నా అందుకొక పరిపూర్ణ దృష్టాంతం. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు శాంతియుత నిరసన మార్గాన్ని ఎంచుకున్నందుకు ఆ యువజనులకు మనం కృతజ్ఞతలు చెప్పాలి. వారి నిరసన వ్యవస్థపై తిరుగుబాటు కాదు. ప్రజాస్వామిక రాజకీయాలలో విశ్వాసాన్ని అది పునరుజ్జీవింపజేసింది. ఆ యువ ఉద్యమకారులు ప్రజాస్వామ్యానికి హాని చేయలేదు. ప్రజాస్వామ్యాన్ని వారు పునరుద్ధరించారు.

# కుత్బుల్లాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతన బోర్‌వెల్ ప్రారంభోత్సవం

( జూలై - 30- హంసకలం వార్త )

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ (కుత్బుల్లాపూర్ డివిజన్) పరిధిలోని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపీ లాడ్స్ నిధుల ద్వారా మంజూరైన నూతన బోర్‌వెల్‌ను నేడు ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వచ్ఛమైన నీటి సౌకర్యం కల్పించేందుకు ఎంపీ లాడ్స్ నిధులు మంజూరు చేసిన మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ కి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఈ బోర్‌వెల్ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బందికి స్వచ్ఛమైన నీటి సౌకర్యం అందుబాటులోకి రావడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని తెలిపిన బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, డివిజన్ అధ్యక్షులు జోగిని రాజు, నార్లకంటి ప్రతాప్, నల్లనాగుల కృష్ణ, పెద్దింటి సాయిలు, ప్రవీణ్ గౌడ్, సతీష్ చక్రవర్తి, బాలరాజు, నాగదీప్ గౌడ్, పద్మా రెడ్డి, బాబి నీల, లక్ష్మి, పాపయ్య దొర, అంజయ్య, వీరేశం, దీపిక, వెంకటేశ్వరన్, రాజు, మహేష్, అభిద్, శ్రీకాంత్, తేజ తదితరులు పాల్గొన్నారు.



# కరీంనగర్ నగర ప్రజలకు మరింత మెరుగైన ప్రజా రవాణా సేవలు అందించడానికి డా,,బి.ఆర్ బస్ స్టేషన్ లో సిటీ మెట్రో ఎక్స్ ప్రెస్ సర్వీసులను ప్రారంభించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్..

-అనంతరం కరీంనగర్ బస్ స్టేషన్ నుండి వాగేశ్వరి కాలేజీ వరకు సిటీ బస్సులో ప్రయాణం చేసిన మంత్రి , ఎమ్మెల్యేలు, ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి, ఈడీలు సాలోమన్, రాజశేఖర్, పలువురు అధికారులు

( జూలై - 30- హంస కలంవార్త )

మొదటి దశలో మూడు రూట్ లలో కరీంనగర్ -- వాగేశ్వరి కాలేజీ కరీంనగర్ - చింతకుంట కరీంనగర్ -- కొత్తపల్లి హవేలీ సిటీ మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సులను నడుపుతుంది.. మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్ పట్టణంలో చాలా కాలంగా డిమాండ్ ఉన్న సిటీ బస్సులను ప్రారంభించుకోవడం జరిగింది..పెరుగుతున్న నగర అవసరాలకు అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు ,మహిళలకు ఈ బస్సులు ఎంతగానో ఉపయోగపడతాయి.. ప్రతిరోజు ఉపాధి కొరకు కరీంనగర్ నుండి వచ్చే చింతకుంట , ఓద్యారం, కొత్తపల్లి ,విద్యా సంస్థలకు నిలయమైన వాగేశ్వరి వైపు ఈ సిటీ బస్సు సర్వీసులు నడిపించడం జరుగుతుంది మెడికల్ కాలేజీలు ఉండే ప్రతిమ, చల్మడ, మానకొండూరు వైపు కూడా బస్సులు నడుపుతాం..ప్రయాణికులు ఆదరిస్తే 24 గంటలు బస్సులు నడిసెల చర్యలు తీసుకుంటాం.. అవసరమైతే ఒకే రూట్ లో అదనపు బస్సులు నడిపించడానికి చర్యలు తీసుకుంటున్నాం.. నగర ప్రజలంతా సిటీ బస్సులను వాడుకోవాలి.. సిటీ మొత్తం నలుమూలల వైపు బస్సులు నడుస్తున్నాయి.. రాష్ట్రంలో కొత్త రూట్ లలో బస్సులు నడుపుతున్నాం.. మహా లక్ష్మీ ద్వారా మహిళలు ఆర్టీసీ లో ఉచిత బస్సు ప్రయాణం ఉపయోగించుకుంటున్నారు.. కొత్త బస్సుల కొనుగోలు ,కొత్త నియామకాలు చేపట్టాం, వారి పెండింగ్ బకాయిలు తీర్చడం జరిగింది ప్రతి గ్రామానికి బస్ చేరాలి..ఆర్టీసీ ప్రతి రోజు 35 లక్షల కిలోమీటర్లు 65 లక్షల మంది ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. ప్రయాణికుల సౌకర్యమే మొదటి ప్రాధాన్యం : టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి. ?"కరీంనగర్ నగరవాసుల దీర్ఘకాలిక కల నెరవేరుస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. విద్యార్థులు, మహిళలు, ఉద్యోగుల ప్రయాణ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆధునిక సౌకర్యాలతో ఈ 'సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్' బస్సులను అందుబాటులోకి తెచ్చాం. సమయానుకూలంగా, సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే మన టీజీఎస్ ఆర్టీసీ ప్రాథమిక లక్ష్య మని ఎండీ నాగిరెడ్డి పేర్కొన్నారు." కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం , కవ్వంపల్లి సత్యనారాయణ, మేయర్ కొలగాని శ్రీనివాస్ , జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా , ఆర్టీసీ ఈడీలు సాలోమన్, రాజశేఖర్, ముఖ్య నేతలు ,అధికారులు పాల్గొన్నారు.





# వేములవాడ బస్ స్టేషన్ ఆధునీకరణ కు శంకుస్థాపన చేసిన మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ..

-అనంతరం వేములవాడ కోరుట్ల మీదుగా బాసర కు ఎక్స్ ప్రెస్ బస్సును ప్రారంభించిన మంత్రులు

( జూలై - 30- హంస కలంవార్త )

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ , మేడిపల్లి సత్యం , సంజయ్ కుమార్ , మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి,జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్ ,ఎస్పీ , ఆర్టీసీ ఈడీలు సాలోమన్, రాజశేఖర్, ఇతర ముఖ్య నేతలు, అధికారులు...

-మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళలందరికీ 48 గంటల్లో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించడం జరిగింది.. ప్రభుత్వం ఏర్పడగానే మహాలక్ష్మి ద్వారా ప్రయాణికుల సంఖ్య పెరిగింది.. అదనపు బస్సులు కొనుగోలు చేయడం జరిగింది. కొత్తగా నియామకాలు చేయడం జరిగింది.. 1984 లో ఈ బస్ స్టేషన్ నిర్మించారు..మళ్ళీ ఇపుడు దీనిని ఆధునీకరించడం జరుగుతుంది.. గతంలో ఇక్కడ నుండి బస్ స్టేషన్ ఎత్తివేయాలని చూస్తే పోరాటాలు చేశాం.. వేములవాడ బస్ స్టేషన్ కు 1.6 కోట్ల రూపాయల తో ఆధునీకరణ కు శంకుస్థాపన చేసుకోవడం జరిగింది.. దక్షిణ కాశి గా పిలువబడే వేములవాడ లో ప్రతి రోజు 250 బస్సులు 560 ట్రిప్పులు ఇక్కడి నుండి వెళ్తుంటాయి.. కోరుట్ల మీదుగా బాసర బస్ ప్రారంభం చేసుకున్నాం.. గతంలో ముంబయి కి ఇక్కడి నుండి బస్ ప్రారంభించుకున్నాం.. నష్టాల నుండి ఆర్టీసీ లాభాల్లోకి తీసుకురావడం జరిగింది.. ఆర్టీసీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అన్ని అమలు చేస్తున్నాం : పొన్నం ప్రభాకర్.



# కడుపున పుట్టిన కన్న కొడుకులు కాదన్నా... నేనున్నానంటూ ఇరవ్వకు అండగా నిలిచిన వడ్డేపల్లి రాజేశ్వరరావు.

( జూలై - 30- హంస కలంవార్త )

కూకట్‌పల్లి వెంకటేశ్వర నగర్‌కు చెందిన 80 ఏళ్ల వృద్ధురాలు శ్రీమతి విరమ్మ రెండు చెవులు వినిపించక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ జీవనం సాగిస్తున్నారు తన కుమార్తె సహాయంతో రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ని ఆశ్రయిించారు. వృద్ధురాలి పరిస్థితిని చూసి చలించిపోయిన రాజేశ్వరరావు , "అవ్వా... బాధపడకు. నేను నీ కొడుకు లాంటివాడిని" అంటూ మనోధైర్యం నింపారు. అనంతరం సంబంధిత వైద్యుల వద్దకు తీసుకెళ్లి అవసరమైన పరీక్షలు చేయించి, వినికిడి సమస్యకు అవసరమైన ధ్వని పరికరాన్ని (హియరింగ్ ఎయిడ్) అందజేశారు. ధ్వని పరికరం అందుకున్న అనంతరం భావోద్వేగానికి లోనైన విరమ్మ, "నా కష్టం తీర్చిన భగవంతుడు నువ్వేనయ్యా" అంటూ రాజేశ్వరరావు కి కన్నీటి పర్యంతమై కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, "నీకు ఎవరూ లేరని బాధపడకు అవ్వా... నేనున్నాను. ఏ కష్టం వచ్చినా ధైర్యంగా చెప్పు, నీకు ఎల్లప్పుడూ అండగా ఉంటాను" అని భరోసా ఇచ్చారు. మానవత్వంతో స్పందించి నిస్సహాయ వృద్ధురాలికి వినికిడి పరికరం అందించి ఆమె జీవితంలో వెలుగు నింపిన వడ్డేపల్లి రాజేశ్వరరావు సేవా భావాన్ని స్థానికులు అభినందించారు.




## జగద్గిరిగుట్ట డివిజన్ దేవమ్మ బస్తీలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్



( జూలై - 30- హంస కలంవార్త )

జగద్గిరిగుట్ట డివిజన్ దేవమ్మ బస్తిలో 30 లక్షలు రూపాయలు చేపట్టిన అభివృద్ధి పనులు వాటర్ పైప్ లైన్, భూగర్భ డ్రైనేజీ పనులను బుధవారం స్థానిక నాయకుల తో కలసి మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాలను దృష్టిలో పెట్టుకొని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. తను కార్పొరేటర్ గా ఎన్నికైన నాటినుండి డివిజన్ లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, సీసీ రోడ్లు తదితర మౌలిక వసతుల కల్పన కోసం కృషి చేశానని పేర్కొన్నారు. తన పదవీకాలం ముగిసినప్పటికీ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు డి ఈ. సంధ్య, ఏ ఈ. లు అభిరామ్, ఆశ, మాజీ డివిజన్ అధ్యక్షులు మల్లేష్ గౌడ్,మహేందర్, వినయ్, హనుమంతు, బ్రహ్మానంద చారి, ముంతాజ్, యాదగిరి, మనోజ్, ఖలీల్, అంజన్ యాదవ్, గోరేమియా, తదితరులు పాల్గొన్నారు

## జగద్గిరిగుట్ట డివిజన్ న్యూ రాజీవ్ గాంధీనగర్, వాంబే కాలనీ లో వాటర్ పైప్ లైన్, భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్ సమస్యలపై గురువారం



( జూలై - 30- హంస కలంవార్త )

లిమాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ లి పాదయాత్ర నిర్వహించడం జరిగింది. అనంతరం మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలు తెలిపిన సమస్యలను అధికా రులకు సూచించి తక్షణమే ఇట్టి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిలు యాదవ్, రాకేష్, మురళి, రవి, బాలు నాయక్, ఆంజనేయులు, శ్రీశైలం, రమేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు

# పేపర్ లీక్ ముఠాలను ఇక సహించేది లేదు.. ఇన్‌స్టాలో మోదీ కొత్త సందేశం

-పేపర్ లీకులను అరికట్టే సవరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

-స్వాగతించిన ప్రధాని నరేంద్ర మోదీ

-పేపర్ లీక్ మాఫియాపై ఇక కఠిన చర్యలు తప్పవని స్పష్టీకరణ

-పరీక్షల వ్యవస్థను పటిష్ఠం చేయడానికి సంస్కరణలు చేపట్టినట్లు వెల్లడి



( జూలై - 30- హంస కలంవార్త )

విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ పబ్లిక్ పరీక్షల్లో పేపర్ లీకులను అరికట్టే సవరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లభించడాన్ని ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో విడుదల చేసిన ఆయన.. పేపర్ లీక్ మాఫియాపై ఇక కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గత కొన్ని దశాబ్దాలుగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలన్నీ పేపర్ లీకుల సమస్యను ఎదుర్కొన్నాయని మోదీ గుర్తుచేశారు. దీంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని అన్నారు. పరీక్షల వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడానికి ప్రభుత్వం ఇప్పటికే పలు సంస్కరణలు చేపట్టిందని తెలిపారు. పరీక్షల నిర్వహణలో సాంకేతికత వినియోగాన్ని పెంచడం, వేగవంతమైన వ్యవస్థలను అమలు చేయడం, పారదర్శకతను బలోపేతం చేయడం వంటి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కొత్త చట్టంతో పేపర్ లీక్ ముఠాలపై మరిన్ని కఠిన చర్యలు తీసుకునే అవకాశం కలుగుతుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

హంస కలం వార్త HAMSA KALAM VARTA

శుక్రవారం 31 జూలై 2026

# రోజు అద్భుతంగా ఉండాలా?.. ఉదయం ఈ 7 చిన్న అలవాట్లు పాటించండి

-5 గంటలకే లేవాల్సిన అవసరం లేదంటున్న నిపుణులు

-లేవగానే వెంటనే ఫోన్ చూడొద్దని సూచన

-ఉదయం ఎండ ఆరోగ్యానికి చాలా మంచిది

-టీ, కాఫీకి ముందు నీళ్లు తాగాలి

-రోజూ కొద్దిసేపు శరీరాన్ని కదిలించాలి

-పోషకాలు ఉన్న అల్పాహారం తినాలి



( జూలై - 30- హంస కలంవార్త )

ఉదయం 5 గంటలకు లేవడం, జిమ్‌కు వెళ్లడం, ధ్యానం చేయడం.. సోషల్ మీడియాలో కనిపించే 'పర్ఫెక్ట్ మార్నింగ్ రొటీన్' అందరికీ సాధ్యం కాదు. నిజానికి రోజు మంచిగా ప్రారంభం కావాలంటే గడియారం చూపే సమయం కంటే, మీరు రోజును ఎలా మొదలుపెడుతున్నారనేదే ముఖ్యం. మీ జీవనశైలికి సరిపోయే చిన్నచిన్న అలవాట్లు కూడా రోజంతా ఉత్సాహంగా ఉండేందుకు సహాయపడతాయి. అలాంటి సులభమైన ఏడు ఉదయపు అలవాట్లు ఇవే..

లేవగానే ఫోన్ చేతిలోకి తీసుకుంటే నోటిఫికేషన్లు, సోషల్ మీడియా, మెయిల్స్‌లో మునిగిపోతాం. అందుకే కనీసం 10-15 నిమిషాలు ఫోన్‌కు దూరంగా ఉండండి. కిటికీ తెరవడం, స్ట్రెచింగ్ చేయడం లేదా ప్రశాంతంగా కూర్చోవడం ద్వారా మెదడు సహజంగా మేల్కొంటుంది.

**-ఎండను ఆస్వాదించండి**

ఉదయం కిటికీలు తెరిచి ఎండ ఇంట్లోకి వచ్చేలా చేయండి. సహజ కాంతి శరీరంలోని బయోలాజికల్ క్లాక్‌ను సమతుల్యం చేసి, రోజంతా చురుకుదనాన్ని పెంచుతుంది. వీలైతే బాల్కనీలో లేదా బయట కొద్దిసేపు నడవండి.

**-ఒక గ్లాస్ నీళ్లు తాగండి**

రాత్రంతా నిద్రపోయిన తర్వాత శరీరానికి ముందుగా నీళ్లు అవసరం. కాఫీ లేదా టీ తాగే ముందు ఒక గ్లాస్ నీళ్లు తాగడం వల్ల శరీరం తాజాగా మారుతుంది. మంచం పక్కనే బాటిల్ ఉంచుకోవడం ఈ అలవాటును సులభం చేస్తుంది.

**-శరీరాన్ని కదిలించండి**

రోజూ జిమ్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు. కొద్దిసేపు స్ట్రెచింగ్ చేయడం, ఇష్టమైన పాటకు డ్యాన్స్ చేయడం లేదా చిన్న వాక్‌కు వెళ్లడం కూడా సరిపోతుంది. ఇది శరీరానికి కొత్త రోజు ప్రారంభమైందనే సంకేతాన్ని ఇస్తుంది.

**-పోషకాలున్న అల్పాహారం**

బిజీ కారణంగా బ్రేక్‌ఫాస్ట్ మానేయడం మంచిది కాదు. ప్రొటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే అల్పాహారం తీసుకుంటే ఎక్కువసేపు ఆకలి వేయదు. ఓట్స్, గుడ్లు, పెరుగు-పండ్లు లేదా పీనట్ బట్టర్ శాండ్‌విచ్ మంచి ఆప్షన్స్.

**-ముఖ్యమైన పనిని నిర్ణయించుకోండి**

పెద్ద 'టు-డూ లిస్ట్' చూసి ఒత్తిడికి గురికావద్దు. ఈరోజు తప్పకుండా పూర్తి చేయాల్సిన ఒక ముఖ్యమైన పనిని మాత్రమే ముందుగా నిర్ణయించుకోండి. అది పూర్తైతే మిగతా పనులు అదనపు విజయాలుగా అనిపిస్తాయి.

**-ఐదు నిమిషాల ప్రశాంత సమయం**

ధ్యానం లేదా పెద్ద జర్నలింగ్ చేయాల్సిన అవసరం లేదు. టీ తాగుతూ ప్రశాంతంగా కూర్చోవడం, మొక్కలకు నీళ్లు పోయడం, రెండు పేజీలు పుస్తకం చదవడం లేదా ఇష్టమైన పాట వినడం కూడా సరిపోతుంది. ఈ చిన్న విరామం రోజును ప్రశాంతంగా ప్రారంభించడంలో సహాయపడుతుంది.


## ఐటీఆర్ ఫైలింగ్‌కు రేపే ఆఖరు.. ఆలస్యమైతే రూ. 5,000 ఫైన్

-డిసెంబర్ 31 వరకు ఆలస్యంగా ఫైల్ చేసే అవకాశం

-ఇప్పటికే 5 కోట్లకు పైగా రిటర్న్స్ దాఖలు

-ఫైల్ చేశాక 60 రోజుల్లో ఈ-వెరిఫికేషన్ తప్పనిసరి

( జూలై - 30- హంస కలంవార్త )




ఆదాయపు పన్ను రిటర్నుల (ఐటీఆర్) దాఖలుకు గడువు సమీపిస్తోంది. ఆడిట్ అవసరం లేని పన్ను చెల్లింపుదారులు 2026-27 అసెస్‌మెంట్ సంవత్సరానికి గాను జులై 31లోగా తమ రిటర్నులను సమర్పించాల్సి ఉంది. ఈ గడువు ముగియడానికి మరో ఒక్క రోజు మాత్రమే సమయం మిగిలి ఉంది. నిర్ణీత గడువులోగా ఐటీఆర్ దాఖలు చేయడంలో విఫలమైతే జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. నిర్ణీత సమయంలోగా ఐటీఆర్ ఫైల్ చేయని వారు ఆలస్య రుసుము చెల్లించి, డిసెంబర్ 31, 2026 వరకు తమ రిటర్నులను సమర్పించవచ్చు. నిబంధనల ప్రకారం, వార్షిక ఆదాయం రూ. 5 లక్షల వరకు ఉన్నవారికి రూ. 1,000, అంతకంటే ఎక్కువ ఆదాయం ఉన్నవారికి రూ. 5,000 వరకు జరిమానా విధిస్తారు. అయితే, ప్రాథమిక పన్ను మినహాయింపు పరిమితి కంటే తక్కువ ఆదాయం ఉన్నవారికి ఈ రుసుము వర్తించదు. కాకపోతే, చెల్లించాల్సిన పన్ను బకాయిలు ఏవైనా ఉంటే, వాటిపై వడ్డీ వర్తిస్తుంది. ఆదాయపు పన్ను శాఖ గణాంకాల ప్రకారం, జులై 29 నాటికి 5.02 కోట్లకు పైగా రిటర్నులు దాఖలయ్యాయి. వీటిలో 4.69 కోట్లు వెరిఫై కాగా, 2.33 కోట్లు ఇప్పటికే ప్రాసెస్ అయ్యాయి. ఇటీవల ఒకే రోజులో దాదాపు 30 లక్షల రిటర్నులు సమర్పించడం గమనార్హం. గడువులోగా రిటర్నులు దాఖలు చేయకపోతే రీఫండ్లు ఆలస్యమవడమే కాకుండా, కొన్ని రకాల నష్టాలను తర్వాతి సంవత్సరాలకు క్యారీ ఫార్వర్డ్ చేసుకునే వెసులుబాటును కోల్పోతారని పన్ను నిపుణులు సూచిస్తున్నారు. ఐటీఆర్ దాఖలు చేసిన 60 రోజుల్లోపు ఆధార్ ఓటీపీ, నెట్ బ్యాంకింగ్ లేదా డిజిటల్ సిగ్నేచర్ ద్వారా ఈ-వెరిఫికేషన్ పూర్తి చేస్తేనే ఆ రిటర్న్ చెల్లుబాటు అవుతుంది.

# పోటెత్తుతున్న కృష్ణమ్మ- శ్రీశైలం డ్యామ్ కు వరద ప్రవాహం, గేట్లు ఎత్తివేత..!!

-బి ఏల్‌నినో కష్టాల వేళ బిగ్ రిలీఫ్. వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన సమయంలో కృష్ణానది మాత్రం జలకళను సంతరించుకుంటోంది. ఎట్టకేలకు శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ప్రారంభమైంది.బి

( జూలై - 30- హంస కలంవార్త )

వానా కాలం మొదలై రెండు నెలలైనా ఇప్పటివరకు ఎగువ నుంచి ఇన్ ఫ్లో రాలేదు. కృష్ణా నది ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న కుండపోత వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ఉద్ధృతి గణనీయంగా పెరిగింది. దీంతో, దిగువన ఉన్న శ్రీశైలం జలాశయానికి కృష్ణమ్మ వేగంగా చేరుతోంది.బి తెలుగు రాష్ట్రాలను రెండు నెలల కాలంగా ఎల్‌నినో ప్రభావం కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితు లు ఏర్పడ్డాయి. ఈ సమయంలోనే కృష్ణా నది ఎగువ పరీవాహక ప్రాంతాల్లోకుండపోత వర్షాలు కురుస్తున్నాయి. దీంతోతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ఉద్ధృతి గణనీయంగా పెరిగింది. వారం రోజులుగా ఎగువ రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా వానలు పడుతుండటంతో జూరాలకు ఇన్‌ఫ్లో భారీగా వచ్చి చేరుతోంది. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టుకు 32,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా... అధికారులు క్రస్ట్ గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లే దాదాపు 30,700 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నీరు దిగువన ఉన్న శ్రీశైలం జలాశయానికి కృష్ణమ్మ వేగంగా చేరుతోంది. మహారాష్ట్ర, కర్ణాటకలోని పశ్చిమ కనుమ ల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో.. జూరాలకు ఇన్‌ఫ్లోలు మరింత పెరిగే అవకాశం ఉంది.

**-పెరుగుతున్న ఇన్ ఫ్లో.. అధికారుల అప్రమత్తం**

అదే సమయంలో ఎగువ నుంచి వచ్చే ప్రవాహం భారీగా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఫలితంగా రానున్నన రోజుల్లో శ్రీశైలానికి మరింత ఇన్ ఫ్లో పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా అటు గోదావరి బేసిన్లలో ప్రాజెక్టులకు వరద ప్రవాహం మొదలవడంతో రైతన్నల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎగువ ప్రాంతాలు, స్థానిక పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో



ప్రాజెక్టులు జలకళ సంతరించుకుంటున్నాయి. గోదావరి బేసిన్ లోని ప్రాజెక్టులకు వరద నీరు వచ్చి చేరుతోంది. ఇక, కృష్ణాపై ఎగువన ఉన్న ఆల్మట్టి నుంచి బుధవారం 80 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. కాగా, నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి 89,520 క్యూసెక్కులను జూరాలకు విడుదల చేస్తున్నారు. ఇక.. శ్రీశైలం ప్రాజెక్టుకు ప్రస్తుతం 18,349 క్యూసెక్కుల వరద వస్తోంది. శ్రీశైలం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 823.70కు చేరింది. రానున్న నాలుగు రోజుల్లో ఇన్ ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉందని.. నీటిని దిగువకు విడుదల చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# ఉప్పల్ నియోజకవర్గంలో రూ.76.46 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

( జూలై - 30- హంస కలంవార్త )

రూ.76.46 కోట్లతో నాలుగు ప్రధాన ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం స్టార్మ్ వాటర్ డ్రైన్లు, సీసీ రోడ్లు, ఫుట్‌పాత్‌లు, క్రీడా మౌలిక వసతులు, శ్మశానవాటికల అభివృద్ధికి ప్రాధాన్యం ప్రజలకు ఆధునిక పట్టణ మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం నాణ్యతతో, పారదర్శకంగా నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని అధికారులకు మంత్రి ఆదేశం తెలంగాణ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమలు & వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో రూ.76.46 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి, ఐ.ఎ.ఎస్., మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్ మిక్కిలినేని మను చౌదరి, ఐ.ఎ.ఎస్., ఉప్పల్ జోనల్ కమిషనర్ శ్రీమతి రాధికా గుప్తా, ఐ.ఎ.ఎస్., కీసర డివిజన్ ఆర్డీఓ, ఎంఎంసీ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ రావు, డిప్యూటీ కమిషనర్ (ఉప్పల్) ఆనంద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ బాబు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

**-రామంతాపూర్ -- భజరంగ్ వ్యాయామశాల**

**(రూ.90 లక్షలు)**

యువతకు ఆధునిక క్రీడా సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో భజరంగ్ వ్యాయామశాల భవనం గ్రౌండ్ ఫ్లోర్ విస్తరణ, బోర్‌వెల్ ఏర్పాటు, ఆధునిక జిమ్ పరికరాల ఏర్పాటుకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ పనుల ద్వారా క్రీడాకారులకు మెరుగైన శిక్షణ వాతావరణం కల్పించనున్నారు.

**-రామంతాపూర్ భాగాయత్ -- ఉప్పల్**

**(రూ.56.355 కోట్లు)**

ఈ ప్యాకేజీ కింద ప్రధాన స్టార్మ్ వాటర్ డ్రైన్ల నిర్మాణం, ఫుట్‌పాత్‌ల అభివృద్ధి, మల్టీ స్పోర్ట్స్ అరేనా నిర్మాణం, పలు కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణం



మరియు మరమ్మతులు, వి.టి. కమాన్ వద్ద బస్ స్టాప్ అభివృద్ధితో పాటు అనుబంధ మౌలిక వసతుల కల్పన పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పనులు వర్షపు నీటి పారుదల వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన రవాణా, క్రీడా సౌకర్యాలను అందించనున్నాయి.

**-బొడ్రాయి -- చిలకనగర్ -- బీరప్పగడ్డ**

**(రూ.3.23 కోట్లు)**

ఈ ప్రాంతాల్లో దెబ్బతిన్న సీసీ రోడ్ల మరమ్మతులు, స్టార్మ్ వాటర్ డ్రైన్ల పునర్నిర్మాణం, రిటైనింగ్ వాల్, స్టీల్ గిర్డర్ వంతెన నిర్మాణం, శ్మశానవాటికల అభివృద్ధి పనులు, బీరప్పగడ్డ ప్రాంతంలో రోడ్ల అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

**-చెర్లపల్లి (రూ.15.97 కోట్లు)**

చెర్లపల్లి, వాంపుగూడ, కాప్రా ప్రాంతాల్లో కల్వర్టుల పునర్నిర్మాణం, బలోపేతం, విస్తరణ, టెర్షియరీ స్టార్మ్ వాటర్ డ్రైన్ల నిర్మాణం, పునర్నిర్మాణం, ఆర్‌సీసీ పైపులైన్ల ఏర్పాటు, సీసీ రోడ్ల నిర్మాణం, వర్షపు నీటి పారుదల వ్యవస్థ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన పట్టణ మౌలిక వసతులు, ఆధునిక పౌర సేవలు, సమర్థవంతమైన వర్షపు నీటి పారుదల వ్యవస్థను అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో చేపడుతున్న ఈ అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం రహదారి సౌకర్యాలు, డ్రైనేజీ వ్యవస్థ, క్రీడా మౌలిక వసతులు, ప్రజా సౌకర్యాలు గణనీయంగా మెరుగుపడి ప్రజల జీవన ప్రమాణాలు మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటాయని తెలిపారు. అభివృద్ధి పనులను అత్యున్నత నాణ్యత ప్రమాణాలతో, పూర్తి పారదర్శకతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. మొత్తం రూ.76.46 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఈ కార్యక్రమంలో శంకుస్థాపనలు నిర్వహించబడగా, ఉప్పల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ఇది ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని అధికారులు తెలిపారు.

# భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

-జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులకు సి.ఎస్. ఆదేశంలి

( జూలై - 30- హంస కలంవార్త )

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వివిధమైన ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. రాష్ట్రంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, మరో రెండు రోజుల పాటు కురిసే అవకాశం ఉన్నందున చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమీషనర్లు, ఎస్. పి లతో సి.ఎస్ సంజయ్ జాజు గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీజీపీ సి.వీ ఆనంద్, అడిషనల్ డీజీ భగవత్, డిజాస్టర్ మేనేజ్ మెంట్ కార్యదర్శి హరిచందన, నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, గురువారం రాత్రి కూడా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలుపుతున్నందున జిల్లాల్లో పోలీసు వివిధ శాఖలతో సమన్వయంతో తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రతి జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. ప్రధానంగా, ఆయా జిల్లాలో వాటర్ ఫాల్స్, ప్రమాదకర ప్రదేశాలు ఉన్న పర్యాటక ప్రాంతాలకు పర్యాటకులను వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల కలెక్టర్లు పరిస్థితులను ఎప్పటి కప్పుడు సమీక్షిస్తుండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. ఇప్పటికే, ఎన్.డీ.ఆర్.ఎఫ్. ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచామని, అవసరమైనప్పుడు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. కాగా, ఎల్.నినో ప్రభావం వల్ల సెప్టెంబర్ లోనూ వర్షపాతం తక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ పేర్కొన్నందున వరి కాకుండా ప్రత్యామ్నాయ పంటలను వేసేలా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రధానంగా, కూరగాయలు పండిస్తే మార్కెట్ లో మంచి ధర ఉండడమే కాకుండా హారే కృష్ణ ఫౌండేషన్ ద్వారా కూడా కొనుగోలు చేయించడం జరుగుతుందని సి.ఎస్ అన్నారు. వచ్చే రెండు



రోజుల్లో భారీ వర్షాలు కురిసే జిల్లాలపై ప్రధానంగా దృష్టి సారించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తుగానే చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో249 ప్రమాదకర జలాశయాలున్న పిక్-నిక్ స్పాట్స్ లను గుర్తించామని, మరో 167 పర్యాటక ప్రాంతాలను గుర్తించి భారీ వర్షాలు, వరదలున్న సమయంలో ఈ పర్యాటక ప్రాంతాలకు వెళ్లకుండా పోలీస్ శాఖ తగు చర్యలను చేపట్టిందని డీజీపీ సి.వీ ఆనంద్ వెల్లడించారు. 12 కంపెనీల బృందాలు కూడా సిద్ధంగా ఉండాలన్నారు.

# పేపర్ లీక్‌లపై కేంద్రం ఉక్కుపాదం.. రాజ్యసభలోనూ ఆమోదం పొందిన బిల్లు

-రాష్ట్రపతి ఆమోదం లభించిన వెంటనే అమల్లోకి చట్టం
-గరిష్ఠంగా రూ.10 కోట్ల జరిమానా
-జైలు శిక్ష, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ
-ఎన్‌టీఏపై ప్రతిపక్షం విమర్శలు
-సమగ్ర సంస్కరణలపై కొనసాగుతున్న డిమాండ్

( జూలై - 30- హంస కలంవార్త )

దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, పేపర్ లీక్‌లను అరికట్టడం లక్ష్యంగా తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-2026కు పార్లమెంట్ ఆమోదం లభించింది. ఇప్పటికే లోక్‌సభలో ఆమోదం పొందిన ఈ బిల్లుకు గురువారం రాజ్యసభలోనూ ఆమోదం లభించింది. దీంతో రాష్ట్రపతి అంగీకారం లభించగానే ఇది చట్టంగా అమల్లోకి రానుంది. కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ మంత్రి జితేంద్ర సింగ్ ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. చర్చ సందర్భంగా ప్రభుత్వం, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడివేడీ వాదనలు జరిగాయి. పేపర్ లీక్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవడానికే ఈ సవరణలు తీసుకొచ్చామని ప్రభుత్వం స్పష్టం చేసింది. భారీ జరిమానాలు, ప్రత్యేక కోర్టులు, వేగవంతమైన విచారణలతో అక్రమాలకు అడ్డుకట్ట వేస్తామని తెలిపింది ఈ సవరణల ప్రకారం పేపర్ లీక్‌లకు పాల్పడిన వారిపై గరిష్ఠంగా రూ.10 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. జైలు శిక్షతో పాటు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో విచారణ పూర్తి చేసే నిబంధనలను కూడా చేర్చారు. పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడే ముఠాలపై మరింత కఠినంగా వ్యవహరించేందుకు ఈ మార్పులు ఉపయోగపడతాయని ప్రభుత్వం పేర్కొంది. 2024లో తీసుకొచ్చిన చట్టం అమలులో వచ్చిన అనుభవాల ఆధారంగానే ఈ సవరణలు రూపొందించినట్లు జితేంద్ర సింగ్ తెలిపారు. ఆ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత 52 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని చెప్పారు. పేపర్ లీక్‌ల కారణంగా ఆత్మహత్యల సంఖ్య కూడా తగ్గిందని సభకు వివరించారు. అయితే ప్రతిపక్షం



మాత్రం బిల్లుపై విమర్శలు గుప్పించింది. కేవలం శిక్షలు పెంచడం సరిపోదని, పరీక్షల నిర్వహణ వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు అవసరమని డిమాండ్ చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పనితీరుపైనా ప్రశ్నలు లేవనెత్తింది. మరోవైపు విద్యార్థుల ప్రయోజనాల కోసం కేంద్రం వేగంగా చర్యలు తీసుకుందని అధికార పక్షం పేర్కొంది. మాజీ విద్యాశాఖ మంత్రి రాజీనామా, నందన్ నీలేకని నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు, నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించడం వంటి చర్యలను ప్రస్తావించింది.

# ఒరిజినల్ డాక్యుమెంట్లు గల్లంతు.. ఎస్బీఐకి వినియోగదారుల కమిషన్ భారీ షాక్

-కస్టమర్‌కు చెందిన ఆస్తి పత్రాలు పోగొట్టిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
-బాధితుడికి రూ. 3 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించిన వినియోగదారుల కమిషన్
-హోం లోన్ గ్యారంటీగా పెట్టిన డాక్యుమెంట్లు గల్లంతు కావడంతో వివాదం
-ఎస్బీఐ వాదనలను తోసిపుచ్చి, బ్యాంకు నిర్లక్ష్యాన్ని తప్పుపట్టిన ఫోరం

( జూలై - 30- హంస కలంవార్త )

ఖాతాదారుడికి చెందిన కీలకమైన ఆస్తి పత్రాలను పోగొట్టిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ)పై రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. బ్యాంకు నిర్లక్ష్యం కారణంగా తీవ్ర మానసిక వేదనకు గురైన బాధితుడికి రూ. 3 లక్షల నష్టపరిహారంతో పాటు, వ్యాజ్యం ఖర్చుల నిమిత్తం మరో రూ. 20,000 చెల్లించాలని ఆదేశిస్తూ తీర్పు వెలువరించింది. ఇబ్రహీంపట్నం పరిధిలోని బొంగులూరుకు చెందిన బి. వెంకటేశం, ఎస్బీఐ ఆదిభట్ల బ్రాంచ్‌లో రూ. 5 లక్షల గృహ రుణం తీసుకున్నారు. ఈ రుణానికి అదనపు హామీగా తన బంధువు అంజయ్యకు చెందిన 194 చదరపు గజాల ప్లాట్‌కు సంబంధించిన ఒరిజినల్ సేల్ డీడ్, ఇతర లింక్ డాక్యుమెంట్లను బ్యాంకులో సమర్పించారు. మార్చి 2022లో వెంకటేశం రుణం మొత్తాన్ని వడ్డీతో సహా తిరిగి చెల్లించి, బ్యాంకు నుంచి నో-డ్యూస్ సర్టిఫికేట్ కూడా పొందారు. అనంతరం తన పత్రాలను తిరిగి ఇవ్వాలని ఆయన బ్యాంకును కోరగా, అధికారులు తొలుత పొంతన లేని సమాధానాలు ఇచ్చారు. సెంట్రలైజేషన్ ప్రక్రియ జరుగుతోందని, 15 రోజుల్లో ఇస్తామని కాలయాపన చేశారు. ఆ తర్వాత అసలు పత్రాలు కనిపించడం లేదని బ్యాంకు వర్గాలు సమాధానం ఇవ్వడంతో బాధితుడు దిగ్భ్రాంతికి గురయ్యారు. దాదాపు రెండేళ్లపాటు బ్యాంకు చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడం, బ్యాంకు యాజమాన్యం కేవలం ధ్రువీకృత నకళ్లు (సర్టిఫైడ్ కాపీలు) మాత్రమే



ఇవ్వడంతో ఆయన న్యాయం కోసం వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ కేసు విచారణ సందర్భంగా, తమ వైపు సేవల లోపం లేదని, పత్రాల అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, ప్రత్యామ్నాయ పత్రాల కోసం పత్రికా ప్రకటన కూడా ఇచ్చామని ఎస్బీఐ వాదించింది. అయితే, బ్యాంకు వాదనలను కమిషన్ తోసిపుచ్చింది. రుణం వెంకటేశం పేరు మీద ఉందని, పత్రాల భద్రతలో బ్యాంకు నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొంటూ, బాధితుడికి తగిన నష్టపరిహారం చెల్లించాలని ఎస్బీఐని ఆదేశించింది.

# దేశంలో అడుగు పెట్టిన వెంటనే హసీనాను అరెస్ట్ చేస్తాం.. బంగ్లా మంత్రి హెచ్చరిక!

-డిసెంబర్‌లో స్వదేశానికి వెళతానన్న హసీనా
-కోర్టులో లొంగే అవకాశం ఉండకపోవచ్చన్న ఆ దేశ మంత్రి
-హసీనా పాస్‌పోర్టు ఇప్పటికే రద్దు
-2025లో మరణశిక్ష విధించిన ట్రైబ్యునల్

( జూలై - 30- హంస కలంవార్త )

స్వదేశానికి వెళ్లాలనుకుంటున్నట్లు బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రకటించిన నేపథ్యంలో అక్కడి ప్రభుత్వం మరోసారి తన కఠిన వైఖరి వెల్లడించింది. దేశంలో అడుగుపెట్టిన క్షణమే ఆమెను అరెస్ట్ చేస్తామని ఆ దేశ న్యాయశాఖ మంత్రి ఎం.అసదుజ్జమాన్ స్పష్టం చేశారు. చట్ట ప్రకారమే చర్యలు తీసుకుంటామని, ఇందులో ఎలాంటి మినహాయింపు ఉండదని పేర్కొన్నారు. ఫ్రాన్స్‌కు చెందిన వార్తా సంస్థ ఏఎఫ్‌పీకి ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో షేక్ హసీనా ఈ ఏడాది డిసెంబర్‌లోగా స్వదేశానికి తిరిగి వెళ్తానని చెప్పారు. తనను అరెస్ట్ చేసే అవకాశం ఉందని, హత్య కూడా చేయొచ్చని తెలుసని, అయినా ప్రజలు పిలుస్తున్నందున తిరిగి వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. గత నెలలో ఎన్డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో కూడా ఎన్ని అడ్డంకులు వచ్చినా బంగ్లాదేశ్‌కు వెళతానని చెప్పారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన న్యాయశాఖ మంత్రి, మరణశిక్ష పడిన వ్యక్తిగా హసీనాకు కోర్టులో నేరుగా లొంగిపోయే అవకాశం కూడా దక్కకపోవచ్చని అన్నారు. ఆమె బంగ్లాదేశ్ పౌరురాలిగా స్వదేశానికి వచ్చే హక్కు ఉన్నా, దేశంలోకి ప్రవేశించిన వెంటనే చట్ట ప్రకారం అరెస్ట్ చేస్తామని చెప్పారు. మధ్యంతర ప్రభుత్వం ఇప్పటికే షేక్ హసీనా పాస్‌పోర్టును రద్దు చేసింది. అలాంటప్పుడు ఆమె ఎలా వస్తారన్న ప్రశ్నకు అది ఆమె సమస్యని మంత్రి వ్యాఖ్యానించారు. ఆమె ఎలాంటి మార్గంలో దేశంలోకి వచ్చినా చట్టపరమైన చర్యలు తప్పవని చెప్పారు. 2024లో విద్యార్థుల ఉద్యమం తర్వాత హసీనా ప్రభుత్వం కూలిపోయిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆమె భారత్‌లో



రహస్య ప్రాంతంలో ఉంటున్నారు. 2025లో బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ ఆమెకు మరణశిక్ష విధించింది. అయితే ఈ తీర్పును హసీనా రాజకీయ కక్షసాధింపుగా అభివర్ణించారు. మరోవైపు, ఈ విచారణలో న్యాయపరమైన లోపాలున్నాయని అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు విమర్శించాయి. హసీనాను అప్పగించాలని బంగ్లాదేశ్ చేసిన అభ్యర్థన ప్రస్తుతం పరిశీలనలో ఉందని భారత్ తెలిపింది.

# విశాఖ రైల్వేకు శుభవార్త.. రూ.299 కోట్లతో కొత్త లైన్లు, ప్లాట్‌ఫారాలు

-ఆరు కొత్త లైన్లు, ప్లాట్‌ఫారాల నిర్మాణం
-రైళ్ల ఆలస్యం, రద్దీ తగ్గించడమే లక్ష్యం
-తూర్పు వైపు కొత్త ప్రవేశ ద్వారం

( జూలై - 30- హంస కలంవార్త )

విశాఖ రైల్వే స్టేషన్ నుంచి రోజూ సుమారు 80 వేల మంది ప్రయాణం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో పెరుగుతున్న రద్దీకి చెక్ పడనుంది. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు రైళ్ల రాకపోకలను మరింత సులభతరం చేసేందుకు భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. రూ.299 కోట్లతో విశాఖ కోచింగ్ యార్డు ఆధునికీకరణకు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుతో స్టేషన్ నిర్వహణ సామర్థ్యం పెరగడంతో పాటు రైళ్ల ఆలస్యం తగ్గే అవకాశం ఉంది. దక్షిణ కోస్ట్ రైల్వే పరిధిలోని విశాఖపట్నం కోచింగ్ యార్డును పూర్తిగా పునర్వ్యవస్థీకరించనున్నారు. ఇందులో ఆరు కొత్త లైన్లు, అదనపు ప్లాట్‌ఫారాలు నిర్మించనున్నారు. ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఉన్న ఆరు ప్లాట్‌ఫారాలను కూడా విస్తరించనున్నారు. దీంతో యార్డులో రద్దీ తగ్గి రైళ్ల కదలిక మరింత వేగంగా సాగనుంది. ప్రస్తుతం విశాఖ రైల్వే స్టేషన్ నుంచి




రోజూ సుమారు 80 వేల మంది ప్రయాణిస్తున్నారు. సగటున 113 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రస్తుత యార్డు నిర్మాణం కారణంగా టెర్మినేటింగ్ రైళ్లు, ఇతర రైళ్లు ఒకే మార్గాలను దాటాల్సి వస్తోంది. దీనివల్ల అప్రోచ్ సిగ్నళ్ల వద్ద రైళ్లు నిలిచిపోవడం, ప్లాట్‌ఫారాల లభ్యత తగ్గడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. కొత్త ప్రాజెక్టు పూర్తైతే ఈ సమస్యలు గణనీయంగా తగ్గనున్నాయి. రైళ్ల నిలిపివేత సమయం తగ్గుతుంది. ప్లాట్‌ఫారాల వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. భవిష్యత్తులో మరిన్ని రైళ్లను నిర్వహించే వీలుంటుంది. తూర్పు వైపు కొత్త ప్రవేశ ద్వారం నిర్మించడంతో పాటు ప్రయాణికుల రిజర్వేషన్ కేంద్రాన్ని కూడా కొత్త ప్రదేశానికి తరలించనున్నారు.

# నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై మౌనం ఎందుకు? కారణం చెప్పిన రాఘవ్ చద్దా

-నీట్ పేపర్ లీక్‌పై తన మౌనంపై స్పందించిన రాఘవ్ చద్దా
-ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రశ్నలు వేయడం తన పని అని వెల్లడి
-ప్రభుత్వంలోకి వచ్చాక పరిష్కారాలు చూపడమే బాధ్యత అని స్పష్టీకరణ
-విద్యార్థుల కోపం, బాధ సమర్థనీయమేనని అంగీకారం
-పబ్లిక్ పరీక్షల బిల్లుతో పటిష్టమైన వ్యవస్థను తీసుకొస్తున్నామన్న చద్దా



( జూలై - 30- హంస కలంవార్త )

నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వివాదంపై ఇప్పటివరకు తాను ఎందుకు మౌనంగా ఉన్నానో రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా గురువారం వివరణ ఇచ్చారు. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-2026పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన బాధ్యతలో మార్పు వచ్చిందని, ప్రస్తుతం తాను పరిష్కార మార్గాలను సూచించే స్థానంలో ఉన్నానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నీట్ పేపర్ లీకేజీపై రాఘవ్ చద్దా ఎందుకు మౌనంగా ఉన్నారంటూ చాలామంది ప్రశ్నించారు. గతంలో నేను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వాన్ని నిలదీయడం నా బాధ్యతగా భావించి, దానిని చిత్తశుద్ధితో నిర్వహించాను. అయితే ఇప్పుడు నా బాధ్యత కేవలం ప్రశ్నలు వేయడమే కాదు, సమస్యకు సరైన పరిష్కారాలను చూపడం. అందుకే ఈ సమస్యకు ఒక నిర్మాణాత్మక పరిష్కారంతోనే ప్రజల ముందుకు రావాలని నిర్ణయించుకున్నాను. ఆ సమయం నేడు ఆసన్నమైంది" అని వివరించారు. పేపర్ లీకేజీలను ఒక తీవ్రమైన రుగ్మతతో పోల్చిన చద్దా, కేవలం మీడియా ప్రకటనల ద్వారా కాకుండా, వ్యవస్థాగత మార్పుల ద్వారానే దీనిని అరికట్టగలమని అభిప్రాయపడ్డారు. పరీక్షలలో అక్రమాలను నిరోధించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లును ఒక సమగ్రమైన విధానంగా ఆయన అభివర్ణించారు. సత్వర దర్యాప్తు, ఉన్నత స్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు, భవిష్యత్తులో నీట్ పరీక్షలను కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించడం వంటి కీలక చర్యలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. నీట్ అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, వారిలో నెలకొన్న ఆవేదన, ఆగ్రహం సమర్థనీయమేనని చద్దా అంగీకరించారు. విద్యార్థుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ప్రభుత్వం స్పందించిందని, పరీక్షా వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు చర్యలు చేపట్టిందని ఆయన స్పష్టం చేశారు.

# 15 ఏళ్ల వైభవ్‌కు వైస్ కెప్టెన్సీ ఎందుకు? అసలు కారణం వెల్లడించిన సెలెక్టర్

-వైభవ్‌కు ఈస్ట్‌జోన్ వైస్ కెప్టెన్సీ
-నాయకత్వ లక్షణాల పెంపే లక్ష్యం
-ఇషాన్ కిషన్ జట్టు కెప్టెన్
-బిహార్‌కు ఇప్పటికే వైస్ కెప్టెన్
-అండర్-19లోనూ డిప్యూటీగా అనుభవం
-భవిష్యత్‌లో టీమిండియా కెప్టెన్‌గా ఆశలు



( జూలై - 30- హంస కలంవార్త )

భారత క్రికెట్‌లో సంచలనంగా మారిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి దులీప్ ట్రోఫీ-2026లో ఈస్ట్‌జోన్ వైస్ కెప్టెన్సీ అప్పగించడం చర్చనీయాంశమైంది. ఇంత చిన్న వయసులో బాధ్యతలు ఇవ్వడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అయితే ఈ నిర్ణయం వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని ఈస్ట్‌జోన్ సెలెక్టర్, మాజీ రంజీ క్రికెటర్ ప్రవంజన్ వెల్లడించారు. భవిష్యత్‌లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకే వైభవ్‌కు ఈ బాధ్యతలు ఇచ్చామని చెప్పారు. ఈస్ట్‌జోన్ జట్టుకు ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడని, వైభవ్‌ను కెప్టెన్‌గా నియమించలేదని ప్రవంజన్ స్పష్టం చేశారు. ఇషాన్ వికెట్‌కీపర్ కావడంతో మ్యాచ్‌లో ఎక్కువ సమయం మైదానంలో చురుగ్గా ఉంటాడని చెప్పారు. వైభవ్ రోజంతా జట్టును నడిపించాల్సిన పరిస్థితి ఉండదని వివరించారు. చిన్న వయసులోనే బాధ్యతలు ఇవ్వడం వల్ల అతడిలో నాయకత్వ నైపుణ్యాలు మరింత మెరుగుపడతాయని అభిప్రాయపడ్డారు. వైభవ్‌కు నాయకత్వ అనుభవం కొత్తేమీ కాదని ప్రవంజన్ గుర్తుచేశారు. ఇప్పటికే బిహార్ తరఫున ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో వైస్ కెప్టెన్‌గా ఉన్నాడని తెలిపారు. అండర్-19 ప్రపంచకప్‌లో కూడా ఆయుష్ మాత్రేకు డిప్యూటీగా బాధ్యతలు నిర్వర్తించిన విషయాన్ని ప్రస్తావించారు. దేశం తరఫున అద్భుతంగా రాణిస్తున్న వైభవ్ ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున కూడా ఆకట్టుకున్నాడని కొనియాడారు. యువ ఆటగాళ్లకు సరైన సమయంలో బాధ్యతలు అప్పగించడం చాలా ముఖ్యమని ప్రవంజన్ అన్నారు. అలాంటి అవకాశాలే వారిని మరింత పరిణతి చెందిన నాయకులుగా తీర్చిదిద్దుతాయని చెప్పారు. భవిష్యత్‌లో వైభవ్ భారత జట్టుకు కెప్టెన్‌గా ఎదగాలని తాము కోరుకుంటున్నామని తెలిపారు. ఆ ఆలోచనతోనే అతడికి దులీప్ ట్రోఫీలో వైస్ కెప్టెన్సీ అప్పగించినట్లు వెల్లడించారు.

హంస కలం వార్త
HAMSA KALAM VARTA
శుక్రవారం 31 జూలై 2026

# బిజినెస్

## మోదీ రూ.151 లక్షల కోట్లు అప్పు చేశారు: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, జులై 30 : ప్రధానమంత్రి నరేంద్రమోదీ అప్పులు ఎక్కువగా చేశారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అందరూ ప్రధాన మంత్రుల కంటే మోదీ అప్పులు ఎక్కువ చేశారని తెలిపారు. గురువారం ఎంసీహెచ్‌ఆర్డీలో సీఎం మీడియాతో మాట్లాడారు. స్వాతంత్ర్యం నుంచి 2014 వరకూ రూ.51లక్షల కోట్ల అప్పు ఉందని వివరించారు. 2014 నుంచి ఇప్పటివరకు ప్రధాని రూ.151లక్షల కోట్ల అప్పులు చేశారని తెలిపారు. విమర్శలు గుర్తు చేసుకుంటూ ఉంటే మనం మనుగడ సాధించలేమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**రామచందర్ రావుకి సీఎం రేవంత్‌రెడ్డి కౌంటర్..**

బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావుకి సీఎం రేవంత్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. విద్యావ్యవస్థ తమ హయాంలో బలపడిందని తెలిపారు. 28వ స్థానంలో ఉన్న మన రాష్ట్రం ఇప్పుడు దేశంలో 18వ స్థానానికి చేరిందని వ్యాఖ్యానించారు. తాను ఎందుకు రాజీనామా చేయాలని ప్రశ్నించారు. విద్యాశాఖకు మంత్రి లేరని.. తాను రాజీనామా చేయాలని ప్రతిపక్షాల నేతలు అంటున్నారని అన్నారు. విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, లంచ్, స్నాక్స్ పెట్టినందుకు రాజీనామా చేయాలా అని ప్రశ్నించారు. తాను కూడా మెలకువలు నేర్చుకోవడానికి హార్వర్డ్ వెళ్లానని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు.

## గూగుల్‌ను అధిగమించిన మైక్రోసాఫ్ట్.. ఏఐ సూపర్ యాప్ గురించి సత్య నాదెళ్ల ఏమన్నారంటే




మైక్రోసాఫ్ట్ మరోసారి అంచనాలను మించి ఆర్థిక ఫలితాలు నమోదు చేసింది. 2026 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో కంపెనీ 90 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 8.6 లక్షల కోట్లు) ఆదాయం నమోదు చేసింది. క్లౌడ్, కృత్రిమ మేధ సేవలే ప్రధాన వృద్ధి ఇంజిన్‌గా నిలిచాయి. ముఖ్యంగా అజుర్ క్లౌడ్ సేవల ఆదాయం 43 శాతం పెరిగింది. క్లౌడ్ వ్యాపారంలో గూగుల్‌ను మైక్రోసాఫ్ట్ వెనక్కి నెట్టిందని కంపెనీ వెల్లడించింది. ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల కీలక ప్రకటన చేశారు. ఈ ఏడాది చివర్లో ఏఐ ఆధారిత 'కో పైలెట్ సూపర్ యాప్'ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ సూపర్ యాప్ ద్వారా చాట్, కోడింగ్, కార్యాలయ సహకార టూల్స్, ఆటోమేటెడ్ ఏఐ ఏజెంట్లు వంటి అనేక సేవలను ఒకే వేదికపై అందించనున్నారు. వినియోగదారులతో పాటు వ్యాపార సంస్థల అవసరాలను కూడా తీర్చేలా ఈ యాప్‌ను రూపొందిస్తున్నట్లు చెప్పారుకాగా, మైక్రోసాఫ్ట్‌కు 2026 ఒక రికార్డు స్థాయి ఆర్థిక సంవత్సరం అని సత్య నాదెళ్ల పేర్కొన్నారు . కంపెనీ వార్షిక ఆదాయం 331 బిలియన్ డాలర్లను దాటిందని తెలిపారు. అందులో మొత్తం క్లౌడ్ వ్యాపారం ద్వారా 214 బిలియన్ డాలర్ల ఆదాయం వచ్చిందని వెల్లడించారు. మైక్రోసాఫ్ట్ ప్రధాన క్లౌడ్ వ్యాపారమైన అజూర్, తొలిసారిగా 100 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించిందన్నారు.

## పండుగల సీజన్‌కు ముందే యెజ్డీ కొత్త బైక్‌లు.. 'అన్‌టేమ్డ్ ట్రినిటీ' శ్రేణి ఆవిష్కరణ




పండుగల సీజన్‌ను లక్ష్యంగా చేసుకుని జావా యెజ్డీ మోటార్‌సైకిల్స్ కొత్త 2026 యెజ్డీ 'అన్‌టేమ్డ్ ట్రినిటీ' శ్రేణిని విడుదల చేసింది. ఓనమ్ పండుగను పురస్కరించుకుని కేరళ నుంచి ఈ కొత్త మోడళ్లను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 20 కొత్త టచ్‌పాయింట్లను ప్రారంభించింది. దీంతో దేశవ్యాప్తంగా డీలర్ నెట్‌వర్క్‌ను ఈ ఏడాదిలో 500 కేంద్రాలకు, 2028 ఆర్థిక సంవత్సరం నాటికి 700 టచ్‌పాయింట్లకు విస్తరించాలనే లక్ష్యాన్ని కంపెనీ ప్రకటించింది. ఈ కొత్త శ్రేణిలో యెజ్డీ అడ్వెంచర్, రోడ్‌స్టర్, స్క్రాంబ్లర్ మోడళ్లను కొత్త రంగులు, అప్‌డేట్లతో అందుబాటులోకి తీసుకొచ్చింది. ముఖ్యంగా యెజ్డీ అడ్వెంచర్‌కు వినియోగదారులు చాలా కాలంగా ఎదురుచూస్తున్న ఫ్యాక్టరీ ఫిటెడ్ ట్యూబ్‌లెస్ క్రాస్-స్పోక్ వీల్స్‌ను తొలిసారి అందించింది. సంప్రదాయ స్పోక్ వీల్స్ బలాన్ని, ట్యూబ్‌లెస్ టైర్ల సౌకర్యాన్ని ఒకేసారి అందించేలా ఈ వీల్స్‌ను రూపొందించినట్లు కంపెనీ తెలిపింది. ఉయెజ్డీ అడ్వెంచర్ 'యెల్లో ఫాల్కన్' వేరియంట్‌లో 334 సీసీ లిక్విడ్ కూల్డ్ ఆల్ఫా2 ఇంజిన్ ఉంది. ఇది 29.6 హెచ్‌పీ శక్తి, 29.9 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ట్రాక్షన్ కంట్రోల్‌తో పాటు రోడ్, రైన్, ఆఫ్‌రోడ్ అనే మూడు ఏబీఎస్ మోడ్‌లు ఉన్నాయి. సాధారణ స్పోక్ వీల్స్ మోడల్ ధర రూ.2,12,969 కాగా, ట్యూబ్‌లెస్ క్రాస్-స్పోక్ వీల్స్‌తో కూడిన మోడల్ ధర రూ.2,32,969 (ఎక్స్‌షోరూమ్). యెజ్డీ రోడ్‌స్టర్ 'గ్రీన్ మాంబా' కొత్త మ్యాట్ గ్రీన్ పెయింట్, అరబికా బ్రౌన్ సీటు, కాపర్ డెకల్స్‌తో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఇందులో కూడా 334 సీసీ లిక్విడ్ కూల్డ్ ఆల్ఫా2 ఇంజిన్‌తో పాటు 6-స్పీడ్ గేర్‌బాక్స్, అసిస్ట్, స్లిప్పర్ క్లచ్‌ను అందించారు. ఈ మోడల్ ధర రూ.2,05,969గా నిర్ణయించారు. యెజ్డీ స్క్రాంబ్లర్ 'గ్రే పాంథర్' మెటాలిక్ గ్రే రంగు, బ్రౌన్ రిబ్డ్ సీటు, ట్యాంక్ ప్యాడ్‌లతో కొత్త రూపంలో వచ్చింది. ఇందులో 334 సీసీ లిక్విడ్ కూల్డ్ కటార్ ఇంజిన్‌ను ఉపయోగించారు. 30 హెచ్‌పీ శక్తి, 30 ఎన్ఎం టార్క్‌తో పాటు లీటరుకు 30 కిలోమీటర్ల మైలేజీ అందేలా ఇంజిన్‌ను ట్యూన్ చేసినట్లు కంపెనీ తెలిపింది. దీని ధర కూడా రూ.2,05,969 (ఎక్స్‌షోరూమ్). కొత్త బైక్‌లతో పాటు కొనుగోలు దారులకు ఆకర్షణీయమైన అమ్మకాల తర్వాత సేవలను కూడా ప్రకటించింది. నాలుగేళ్లు లేదా 50 వేల కిలోమీటర్ల వారంటీని ప్రామాణికంగా ఇస్తోంది. దీన్ని ఆరేళ్ల వరకు పొడిగించుకునే అవకాశం ఉంది. ఏడాది పాటు ఉచిత రోడ్‌సైడ్ అసిస్టెన్స్‌ను అందిస్తోంది. దీన్ని ఎనిమిదేళ్ల వరకు పొడిగించు కోవచ్చు. ఐదేళ్ల వార్షిక నిర్వహణ ప్యాకేజీ కూడా అందుబాటులో ఉంచింది. కొత్త రంగుల శ్రేణికి దేశవ్యాప్తంగా బుకింగ్‌లు ప్రారంభమైనట్లు కంపెనీ వెల్లడించింది.

## భారత హాకీ జెర్సీ మార్పుపై వివాదం- వివరణ ఇచ్చిన హాకీ ఇండియా

స్పోర్ట్స్ డెస్క్:




వచ్చే నెల బెల్జియం, నెదర్లాండ్స్ వేదికలుగా జరగనున్న ఎఫ్ఐహెచ్ పురుషుల, మహిళల హాకీ ప్రపంచకప్‌లకు సంబంధించి భారత జట్ల కొత్త జెర్సీల అంశం క్రీడా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. దశాబ్దాలుగా వస్తున్న సాంప్రదాయ నీలం రంగు స్థానంలో కాషాయం రంగు జెర్సీలను ఆవిష్కరించడంపై మాజీ కెప్టెన్ వీరేన్ రస్కిన్హాతో పాటు అభిమానుల నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. అయితే, ఈ వివాదంపై స్పందించిన హాకీ ఇండియా గురువారం (జులై 30) ఒక ప్రకటన విడుదల చేసింది. జెర్సీ మార్పు వెనుక ఉన్న సాంకేతిక కారణాలను స్పష్టం చేసింది. అంతర్జాతీయ హాకీ మ్యాచ్‌లు జరిగే బ్లూ సింథటిక్ (టర్ఫ్) మైదానాల్లో ఆటగాళ్లు నీలం రంగు దుస్తులు ధరించడం వల్ల దృశ్యం సరిగా ఉండటం లేదని హాకీ ఇండియా తెలిపింది. మైదానం రంగు, కిట్ రంగు కలిసిపోవడం వల్ల ఆటగాళ్ల స్పష్టతలోపిస్తోందని మైదానంలో కోచ్‌లు, ఆటగాళ్లతో పాటు సహాయక బృందం నుంచి ఫీడ్‌బ్యాక్ వచ్చిందని పేర్కొంది. కేవలం ఆటగాళ్ల పనితీరును మెరుగుపరచడానికి, సాంకేతిక ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. అంతేకాకుండా, కాషాయ రంగు మన జాతీయ జెండాలోని మూడు రంగులలో ఒకటి కావడమే కాక, శౌర్యానికి ప్రతీకగా నిలుస్తుందని స్పష్టం చేసింది. గతంలో కూడా జట్టు జెర్సీ రంగులు మారిన దాఖలాలు ఉన్నాయని హాకీ ఇండియా ఈ సందర్భంగా గుర్తుచేసింది. 2014 ప్రపంచకప్‌లో భారత జట్టు పసుపు రంగు జెర్సీలో ఆడగా, 2018 ప్రపంచకప్‌లో స్కై బ్లూ విభిన్నమైన డిజైన్‌తో వచ్చిందని తెలిపింది. మరోవైపు, భారత మాజీ కెప్టెన్ వీరేన్ రస్కిన్హా తన పోస్ట్‌ను అనవసరంగా రాజకీయం చేస్తున్నారని కూడా విమర్శించాడు. 'జెర్సీ రంగు మార్పుపై చాలా అనవసరమైన రాజకీయ వ్యాఖ్యలు చూస్తున్నాను. నేను జోలికి వెళ్లాలనుకోవడం లేదు. హెచ్ఏకు చాలా వినమ్రంగా నా అభిప్రాయా లను తెలియజేశాను. ఫుట్‌బాల్‌కు అర్జెంటీనా ఎలాగో, హాకీకి భారతదేశం కూడా అంతే' అని వీరేన్ పేర్కొన్నాడు. మొత్తంగా హాకీ ఇండియా నుంచి క్లారిటీ రావడంతో ప్రస్తుతం ఈ జెర్సీ రగడకు తెరపడినట్లయింది.

## కామన్వెల్త్ గేమ్స్ 2026: పసిడి వేటలో నీరజ్ చోప్రా..!

స్పోర్ట్స్ డెస్క్:




గ్లాస్గో వేదికగా జరుగుతోన్న కామన్వెల్త్ గేమ్స్ 2026 ఎనిమిదో రోజు క్రీడాభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఘట్టం ఆరంభమైంది. భారత 'గోల్డెన్ బాయ్', మాజీ ఒలింపిక్ ఛాంపియన్ నీరజ్ చోప్రా పురుషుల జావెలెన్ త్రో క్వాలిఫికేషన్ రౌండ్‌లో తన ప్రచారాన్ని ఘనంగా ప్రారంభించాడు. ఎనిమిదేళ్ల విరామం తర్వాత కామన్వెల్త్ గేమ్స్‌లోకి పునరాగ మనం చేసిన నీరజ్, టాప్-3లో నిలవడమే లక్ష్యంగా మైదానంలోకి దిగాడు. ఈ క్వాలిఫయింగ్ పోటీలో శ్రీలంకకు చెందిన రుమేష్ పతిరాగే తొలి ప్రయత్నం లోనే 82.84 మీటర్ల దూరం విసిరి ముందంజలో నిలవగా, పాకిస్థాన్‌కు చెందిన అర్షద్ నదీమ్ 78.63 మీటర్ల దూరాన్ని నమోదు చేశాడు. ఇక గోల్డెన్ బాయ్ నీరజ్ చోప్రా తొలి యత్నంలో 76.28 మీటర్ల దూరం సాధించి ఫైనల్ అర్హత దిశగా అడుగులు వేశాడు. అలానే నీరజ్ తన రెండవ ప్రయత్నంలో మెరుగైన ప్రదర్శనతో పాయింట్ల పట్టికలో 5వ స్థానానికి చేరుకున్నాడు. అతను రెండో ప్రయత్నంలో 79.61 మీటర్ల త్రోను నమోదు చేశాడు. మరోవైపు అథ్లెటిక్స్ విభాగంలో భారత డెకాథ్లెట్ తేజస్విన్ శంకర్ 100 మీటర్ల స్ప్రింట్ రేసును 10.96 సెకన్లలో పూర్తి చేసి ఆకట్టుకున్నాడు. ఇక ఇప్పటికే భారత వెయిట్‌లిఫ్టింగ్ బృందం ఆరు పతకాలతో అద్భుత ప్రదర్శన చేయగా, రాబోయే ఈవెంట్లలో మరిన్ని పతకాలను సొంతం చేసుకునేందుకు భారత్ సన్నాహాలు చేస్తోంది. నీరజ్ ఫైనల్‌కు అర్హత సాధిస్తే పసిడి పతకం దిశగా భారత్ మరో అడుగు ముందుకేసినట్లేనని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# స్పోర్ట్స్

## బంగ్లాదేశ్ అత్యంత సురక్షితం దేశం: తమీమ్ ఇక్బాల్




స్పోర్ట్స్ డెస్క్:

బంగ్లాదేశ్ లో భారత జట్టు పర్యటనపై సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. షెడ్యూల్ ప్రకారం గతేడాది ఆగస్టులోనే 3 వన్డేలు, 3 టీ20లను ఆడేందుకు టీమిండియా వెళ్లాల్సి ఉంది. అయితే సమయంలో బంగ్లాదేశ్ లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో నాడు జరగాల్సిన సిరీస్‌ను ఈ ఏడాది సెప్టెంబర్‌కు వాయిదా వేస్తూ అప్పుడు నిర్ణయం తీసుకున్నారు. బంగ్లాదేశ్‌లో భద్రతపరంగా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉద్దేశంతో తాజాగా బీసీసీఐ పునరాలోచనలో పడింది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు తమీమ్ ఇక్బాల్ మీడియా సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్ అత్యంత సురక్షితమైన దేశమని, భారత్ తప్పకుండా తమ దేశానికి వస్తుందనే నమ్మకం ఉందని ఇక్బాల్ ఆశాభావం వ్యక్తం చేశారు. 'భారత్‌తో సిరీస్ జరుగుతుందా లేదా అనే విషయం గురించి ఇప్పుడే చెప్పలేను. కానీ, తప్పకుండా ఆ జట్టు బంగ్లాలో పర్యటిస్తుందని ఆశిస్తున్నాను. ఇప్పటికే భారతక్రికెట్ బోర్డుతో సంప్రదింపులు జరుపుతున్నాం. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నాం. భారత్ - బంగ్లా మధ్య సిరీస్ ఆసక్తికరంగా ఉంటుందని భావిస్తున్నా. భద్రతపరంగా బంగ్లాదేశ్ అత్యంత సురక్షితమైన దేశం. ఇక్కడ వారికి ఎలాంటి ముప్పు ఉండదు. మా వైపు నుంచి అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నాం' అని తమీమ్ స్పష్టం చేశారు. భారత్ చివరిసారిగా 2022లో బంగ్లాదేశ్‌లో మూడు వన్డేలు, రెండు టెస్టుల సిరీస్ కోసం పర్యటించింది. ఆ సిరీస్‌లో బంగ్లాదేశ్ 2-1 తేడాతో వన్డే సిరీస్‌ను కైవసం చేసుకోగా, భారత్ పుంజుకుని టెస్టు సిరీస్‌ను 2-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసింది. భారత్ ప్రస్తుతం శ్రీలంకలో జరగబోయే టెస్ట్ సిరీస్ కోసం సన్నద్ధమవుతుండగా, బంగ్లాదేశ్ రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం ఆస్ట్రేలియాలో పర్యటించనుంది.

హంస కలం వార్త
శుక్రవారం 31 జూలై 2026

# బాలీవుడ్ నటికి సైబర్ షాక్


## రూ. 2.43 లక్షలు కాజేసిన మోసగాళ్లు



ప్రముఖ బాలీవుడ్ నటి, నిర్మాత కీర్తి కుల్హారి సైబర్ మోసానికి గురయ్యారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆమె క్రెడిట్ కార్డు నుంచి అనధికారికంగా రూ. 2,43,852 మేర లావాదేవీలు జరపడంతో ఆమె ముంబై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై అంబోలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, నగర సైబర్ సెల్ అధికారులు దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే, జూలై 24 రాత్రి ఈ సైబర్ మోసం చోటుచేసుకుంది. అంధేరి వెస్ట్‌లోని ఓ మల్టీప్లెక్స్ వద్ద ఉన్న సమయంలో కీర్తి మొబైల్ ఫోన్‌కు బ్యాంకు నుంచి ఒక సందేశం వచ్చింది. ఆమె క్రెడిట్ కార్డును ఉపయోగించి ఏరోమెక్సికో ఎయిర్‌లైన్స్‌లో 2,525 యూఎస్ డాలర్ల విలువైన లావాదేవీ జరిగినట్లు అందులో ఉంది. దీంతో అప్రమత్తమైన ఆమె వెంటనే బ్యాంకు కస్టమర్ కేర్‌ను సంప్రదించారు. బ్యాంకు అధికారులు ఆమె ఖాతాను పరిశీలించగా, నిమిషాల వ్యవధిలోనే మొత్తం నాలుగు అనధికారిక లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. వాటి మొత్తం విలువ రూ. 2.43 లక్షలకు పైగా ఉండటంతో, తదుపరి నష్టం జరగకుండా బ్యాంకు తక్షణమే ఆ కార్డును బ్లాక్ చేసింది. తాను తన క్రెడిట్ కార్డు పాస్‌వర్డ్, పిన్ లేదా ఇతర రహస్య వివరాలను ఎవరితోనూ పంచుకోలేదని కీర్తి పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో స్పష్టం చేశారు. మాల్వేర్ లేదా స్పైవేర్ ద్వారా ఆమె ఫోన్ లేదా కార్డు వివరాలను సైబర్ నేరగాళ్లు తస్కరించి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. 'పింక్', 'యూరి: ది సర్జికల్ స్ట్రైక్', 'మిషన్ మంగళ్' వంటి చిత్రాలతో పాటు 'ఫోర్ మోర్ షాట్స్ ప్లీజ్!', 'స్కూప్' వంటి వెబ్ సిరీస్‌లతో కీర్తి కుల్హారి ప్రేక్షకులకు సుపరిచితులు.

## కంగనా రనౌత్ వ్యాఖ్యల పై ఘాటుగా స్పందించిన సోనూ సూద్

బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లోకి ఎక్కారు. ఇటీవల జంతర్‌మంతర్ తదితర ప్రాంతాల్లో నిరసన తెలుపుతున్న జెన్-జీ యువతను ఉద్దేశించి ఆమె చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. నిరసనకారులను 'గట్టర్ జనరేషన్' అని సంబోధిస్తూ, వారి రీల్స్ వాంతులు తెప్పించేలా ఉన్నాయని, యువత స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తోందని విమర్శించడంతో సోషల్ మీడియాలో తీవ్ర ఆగ్రహజ్వాలలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై నటుడు సోనూ సూద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కంగనా ప్రవర్తనను తప్పుబడుతూ... ఒకవేళ ఆమె నిజంగానే ఆ వ్యాఖ్యలు చేసి ఉంటే అది అత్యంత సిగ్గుచేటని మండిపడ్డారు. నటులను, ప్రజాప్రతినిధులను స్టార్‌లుగా నిలబెట్టేది ఈ యువతేనని, మాట్లాడే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలని హితవు పలికారు. "యువత మన వెన్నంటి ఉన్నంత కాలమే మన ఎదుగుదల ఉంటుంది. ప్రజలే దేవుళ్లు, అందరినీ కలుపుకుని పోవాలి. వారు లేకపోతే మనకు గుర్తింపు ఎక్కడిది? వృత్తి ఏదైనా ప్రజలతోనే కలిసి ఉండాలి" అని సోనూ సూద్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం సోనూ సూద్ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.



## 'కాంతార' హీరోకు మరో ప్రతిష్ఠాత్మక పురస్కారం

కాంతార' చిత్రంతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నటుడు, దర్శకుడు రిషబ్ శెట్టికి అంతర్జాతీయ వేదికపై అరుదైన గౌరవం లభించింది. ఆస్ట్రేలియాలో నిర్వహించే ప్రతిష్ఠాత్మక 'ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్' 2026లో ఆయన 'లీడర్‌షిప్ ఇన్ సినిమా' పురస్కారానికి ఎంపికయ్యారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను తన సినిమాల ద్వారా ప్రపంచానికి పరిచయం చేసినందుకు గాను IFFM ఈ అవార్డుతో ఆయన్ను సత్కరించనుంది. ఆగస్టు 13న మెల్‌బోర్న్‌లో జరగనున్న వేడుకలో రిషబ్ శెట్టి ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ గౌరవంపై రిషబ్ శెట్టి స్పందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. "ఈ పురస్కారానికి ఎంపికవడం చాలా గౌరవంగా భావిస్తున్నాను. మన సంస్కృతిని, మూలాలను ప్రతిబింబించే కథలకే నేను ఎప్పుడూ ప్రాధాన్యతనిస్తాను. ఇటువంటి కథలు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకోవడం సంతోషాన్నిస్తోంది. మెల్‌బోర్న్‌లో భారతీయ సినిమా వైవిధ్యాన్ని అందరితో కలిసి వేడుక చేసుకోవడానికి ఎదురుచూస్తున్నాను" అని రిషబ్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, రిషబ్ శెట్టి ప్రస్తుతం ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న 'ది ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ మహారాజ్' చిత్రంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు.



# వచ్చేసింది 'రామాయణ' ట్రైలర్

## అంచనాలకు మించి విజువల్ వండర్!



భారత సినీ ప్రేక్షకులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణ'. ఎట్టకేలకు ఈ సినిమాకు సంబంధించిన తొలి భాగం ట్రైలర్‌ను ఈరోజు తెల్లవారుజామున చిత్రబృందం విడుదల చేసింది. రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ నటిస్తున్న ఈ చిత్ర ట్రైలర్, విడుదలైన క్షణం నుంచే సోషల్ మీడియాలో ప్రభంజనం సృష్టిస్తోంది. అద్భుతమైన విజువల్స్, భారీ తారాగణం, ఆకట్టుకునే నేపథ్య సంగీతంతో ట్రైలర్ అంచనాలను మించి ఉందని ప్రేక్షకులు ప్రశంసలు కురిపిస్తున్నారు. 4.09 నిమిషాల నిడివితో కట్ చేసిన ఈ ట్రైలర్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. ముల్లోకాలకు అధిపతిని తానేనంటూ గర్వంగా ప్రకటించుకునే రావణుడి (యశ్) సంభాషణతో ట్రైలర్ ప్రారంభమవుతుంది. లోకంలో అధర్మం పెరిగిపోతున్నప్పుడు, విష్ణువు రాముడి అవతారంలో భూమిపైకి వస్తాడు. రాముడి (రణ్‌బీర్) బాల్యం, రాక్షసులతో పోరాటాలు, సీతతో వివాహం వంటి ఘట్టాలను చూపించారు. ఆ తర్వాత 14 ఏళ్ల వనవాసం, లక్ష్మణుడితో కలిసి సీతారాములు అడవులకు వెళ్లడం, రావణుడు సీతను అపహరించడం వంటి కీలక సన్నివేశాలతో ట్రైలర్ కథపై ఆసక్తిని పెంచింది. ముఖ్యంగా విజువల్ ఎఫెక్ట్స్, నేపథ్య సంగీతం సినిమా స్థాయిని తెలియజేస్తున్నాయి. ఈ చిత్రంలో భారీ తారాగణం నటిస్తోంది. ఒకప్పటి 'రామానంద్ సాగర్' సీరియల్‌లో రాముడిగా మెప్పించిన అరుణ్ గోవిల్ ఇప్పుడు దశరథుడి పాత్రలో కనిపించడం విశేషం. హనుమంతుడిగా సన్నీడియోల్, లక్ష్మణుడిగా రవి దూబే, కౌసల్యగా ఇందిరా కృష్ణన్, కైకేయిగా లారాదత్త, శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్ తమ పాత్రల్లో ఒదిగిపోయారు. నిజానికి ఈ ట్రైలర్‌ను అధికారికంగా విడుదల చేయడానికి ముందే న్యూఢిల్లీలోని భారత్ మండపంలో, ముంబైలో, శాన్ డియాగో కామిక్-కాన్‌లో ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఆ ఈవెంట్ల నుంచి కొన్ని క్లిప్స్ సోషల్ మీడియాలో లీక్ కావడంతో ట్రైలర్‌ను విడుదల చేయాలని అభిమానుల నుంచి తీవ్రమైన ఒత్తిడి వచ్చింది. ఈ నేపథ్యంలోనే మేకర్స్ అధికారికంగా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. నితీశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను నమితా మల్హోత్రా సుమారు రూ.4000 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా రానున్న ఈ చిత్రంలో 'రామాయణ: పార్ట్-1' ఈ ఏడాది దీపావళికి థియేటర్లలోకి రానుండగా, రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు వస్తుంది.



Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037, Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449